17వ
సూర్య
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం,1 మార్చి 2024

పథకాలు వివరాలతో గ్రామసభకు సిద్ధం కావాలి

రంపచోడవరం, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ రంపచోడవరం మండలం పోక్స్ పేట గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ అధ్యక్షతన ఉప సర్పంచ్ కారం సురేష్ బాబు నాలుగో తారీఖున జరిగే గ్రామసభకు సంబంధిత శాఖల వారీగా పంచాయతీలో సంక్షేమ, అభివృద్ధి 4 సంవత్సరాల 9 మాసాలలో గ్రామాలకు, ప్రజలకు అందించిన, పథకాలు వివరాలతో సంబంధిత శాఖల వారీగా పొందుపరచుకొని ఉండాలని పంచాయతీ కార్యదర్శి గారికి ఉప సర్పంచ్ కారం సురేష్ బాబు తెలియజేసారు. అదేవిధంగా 13 ఫైనాన్స్, 14 ఫైనాన్స్, 15 ఫైనాన్స్ నిధుల ద్వారా అభివృద్ధి, సీఎం ప్రత్యేక నిధులు, ఎమ్మెల్సీ నిధుల ద్వారా, ఎమ్మెల్యే నిధుల ద్వారా, ఐటీడీఏ నిధుల ద్వారా, జిల్లా పరిషత్ నిధుల ద్వారా, ఎంపీపీ నిధుల ద్వారా, ఎంపీటీసీ నిధుల ద్వారా, ఎక్కడెక్కడ ఏమి మంజూరు చేశారు, పూర్తి డేటా గ్రామాల వారీగా అప్ స్ట్రక్ ద్వారా పొందుపరచుకొని, ఎక్కడ నుండి ఎక్కడ వరకు పూర్తయినది, పూర్తి చేయవలసినది, పూర్తి డేటా ఉండాలి.అదేవిధంగా సచివాలయ సిబ్బంది విధులు నిర్వహించి నప్పుడు ఎన్ని రేషన్ కార్డులు, ఎన్ని పెన్షన్లు, ఎన్ని గృహాలు ఉన్నాయి, నాలుగు సంవత్సరాల ఆరు మాసాల్లో ఎన్ని రేషన్ కార్డులు, ఎన్ని పెన్షన్లు, ఎన్ని గృహాలు, ఎన్ని వ్యవసాయ పనిముట్లు, ఎన్ని ఉద్యాన శాఖ ద్వారా, ఎన్ని ఐటీడీఏ ద్వారా లబ్ధి పొందిన డేటా పూర్తిస్థాయిలో ఉండాలని కారం సురేష్ బాబు తెలియజేయడం జరిగింది. సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో దూసుకుపోతున్న టిడిపి -జనసేన అభ్యర్థి ఎమ్మెల్యే చినరాజప్ప

- మొదటిరోజు అన్ని ప్రముఖ దేవాలయాలలో ప్రత్యేక పూజలు

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం నియోజకవర్గ టిడిపి-జనసేన ఉమ్మడి అభ్యర్థి, మాజీమంత్రి మరియు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రచారంలో ముందుకు దూసుకుపోతున్నారు. దీనిలో భాగంగా గురువారం ఆయన జిల్లాలో గల ప్రముఖ దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దాపురం నియోజకవర్గంలో గల ప్రముఖ పుణ్యక్షేత్రమైన తొలి తిరుపతిలో వేంచేసియున్న స్వయంభూ శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రచార రథం ప్రారంభించి, ప్రచారం చేస్తూ పట్టణంలోని స్థానిక క్యాంపు కార్యాలయంనకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమని టిడిపి-జనసేన పార్టీలు చేతులు కలిపింది వ్యక్తిగత ప్రయోజనాల కోసమో, అధికారం కోసమో కాదని, 5కోట్ల ఆంధ్ర రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసమని ఆయన తెలిపారు. ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు పెట్టుకున్న కూటమి ఇదని, జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని విధ్వంసంలోకి తీసుకువెళ్ళారని, అన్నా క్యాంటిన్‌లు తెరిచి పేదలకు రూ.5కే భోజనం పెడితే దానిని జగన్‌రెడ్డి మూయించారని, దళిత వైద్యుడిని చాలా మానసిక ఇబ్బందులకు గురిచేశారని, వైసిపి వేధింపులు భరించలేక అంతర్జాతీయ క్రికెట్ ప్లేయర్ హనుమ విహారి పారిపోయాడని, జాన్ క్యాలెండర్ ఎక్కడని, డిఎస్సీ ఎక్కడ అని, ఉచిత ఇసుక ఎక్కడ అని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. ప్రజల ప్రయోజనాల కోసం సూపర్ సిక్స్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని, ఎన్నికల శంఖారావం పేరుతో నియోజకవర్గంలోని ప్రతీ ఇంటికివెళ్ళి,ప్రజలనుకలవడం జరుగుతుం దని, ఆయనతెలిపారు. అలాగే పార్టీలో చేరేందుకు ఎవరు ముందుకు వచ్చినా, చేర్చుకునేందుకు టిడిపి నాయకులు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ఎన్నికల సన్నాహక సమావేశంపై ప్రచారం ఎలా నిర్వహించాలి, ఏవిధంగా చేపట్టాలి, నోటిఫికేషన్ ముందు, తరువాత ప్రచారం చేసే తీరును టిడిపి క్యాడర్‌కు ఆయన వివరించారు. గ్రామస్థాయిలో జనసేన నాయకులం దరిని కలుపుకుని ముందుకు సాగాలని, ఎక్కడ సమన్వయలోపం లేకుండా చూసుకోవాలని టిడిపి ద్వితీయ శ్రేణి నాయకులకు సూచించారు. అలాగే గ్రామస్థాయిలో పార్టీ కోసం పనిచేసిన వారిని ఎవరిని మర్చిపోనని, తాను గతంలో పెద్దాపురం నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని,ఈ ఎన్నికలలో గెలుపొంది మరింత అభివృద్ధి చేస్తానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పెద్దాపురంలో 5వ తేది వరకు ఎన్నికల ప్రచారం వార్డుల వారీగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అంతేగాకుండా తన మీద నమ్మకం ఉంచి చంద్రబాబు, లోకేష్ తిరిగి తనకు టికెట్ ఖరారు చేసినందుకు ఈ సందర్భంగా చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ మరియు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు, టిడిపి యువ నాయకులు నిమ్మకాయల రంగనాగ్, టిడిపి పెద్దాపురం సామర్లకోట పట్టణాధ్యక్షులు రంధి సత్యనారాయణ, అడబాలకుమారస్వామి, టిడిపి మండలాధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), గుడా మాజీ డైరెక్టర్ ఎలిశెట్టి నాని, టిడిపి నాయకులు గుమ్మళ్ళ రామకృష్ణ, కంటే జగదీష్, తూతిక రాజు, యాళ్ళ వీరబాబు, యం.డి. ఆరిఫ్‌ఆలీ, పోతుల శ్రీనివాస్, సింగన అరవింద్ కుమార్, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం సాగునీరు పంపిణీ

- వ్యవసాయ, రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- అనధికర సాగునీరు వినియోగాన్ని అరికట్టేందుకు తనిఖీ బృందాలు ఏర్పాటు
- కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ, మేజర్ న్యూస్ : రబీ సీజన్‌లో ప్రణాళిక బద్ధంగా సాగునీరు పంపిణీ చేపట్టి, శివారు భూములకు సాగునీరు ఎద్దడి లేకుండా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లో రబీ సీజన్‌లో సాగునీరు పంపిణీ ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా.. రెవిన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాకినాడ జిల్లాలో గోదావరి, ఏలేరు, పంపా రిజర్వాయర్ ఆయకట్ల కింద సాగవుతున్న పంటల వివరాలు, సాగునీరు లభ్యత, కాలువల పరిస్థితులను కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులతో చర్చించారు. సాగు నీటి పంపిణీ, నియంత్రణలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి రానున్న రెండు నెలలు అత్యంత కీలకమని ఇరిగేషన్, వ్యవసాయ అధికారుల ప్రణాళిక ప్రకారం పనిచేసి రైతులకు సాగునీరు అందించాలన్నారు. ఇందుకు రెవిన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె తెలిపారు. జిల్లాలో గోదావరి ఆయకట్టు కింద 1.35 లక్షల ఎకరాలు, ఏలేరు ఆయకట్టు కింద 53 వేల ఎకరాలు, పంపా రిజర్వాయర్ కింద సుమారుగా 10వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో నూరు శాతం ఈ-క్రాప్ బుకింగ్ పూర్తయిందని, రైతుల నుంచి ఈ-కేవైసీ కూడా పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.

ముఖ్యంగా శివారు ప్రాంతాలైన తొండంగి, పిఠాపురం, గొల్లప్రోలు, తాళ్లరేవు, పెదపూడి మండలాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇరిగేషన్ శాఖ అనుమతులు లేకుండా అనధికారంగా సాగునీరు వినియోగించడాన్ని నివారించాలన్నారు. ఇందుకు మండల, గ్రామస్థాయిలో వ్యవసాయం, రెవిన్యూ, పోలీస్, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు.

అదేవిధంగా సాగునీరును నియంత్రించే విధంగా అధికారులు ఎప్పటికప్పుడు కాలువలపై పర్యవేక్షణ చేయడంతో పాటు వారాబందీ విధానం, నీటి మట్టం స్థాయిలను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా. డి.తిప్పే నాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జె.సీతారామరావు, జిల్లా వ్యవసాయ శాఖ జేడీ ఎన్.విజయ్ కుమార్, ధవళేశ్వరం నీటిపారుదల శాఖ ఎస్ఈ జీ.శ్రీనివాసరావు, పెద్దాపురం ఈఈ డి.రామ్‌గోపాల్, పెద్దాపురం, కాకినాడ డీఈలు కె.నరేష్, ఎ.రవి, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో సక్రమంగా నిర్వహించండి- ఎంపిడిఓ

అల్లవరం,మేజర్‌న్యూస్: స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో గురు వారం మార్చ్ 3వ తేదీన మండలంలో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం సన్నద్ధతపై ఎంపిడిఓ బి.కృష్ణమోహన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కృష్ణమోహన్ మాట్లాడుతూ మండలంలో గుర్తించిన 5 సం.లోపు 4032 మంది చిన్నారులకు 33 కేంద్రాల వద్ద తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలన్నారు. వ్యాక్సిన్ తరలింపు , నిలువ చేయుటలో కోల్డ్ చైన్ కు అంతరాయం ఏర్పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఎంపిపి యిళ్ళ శేషగిరిరావు మాట్లాడుతూ వైద్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది పల్స్ పోలియో చుక్కలు కార్యక్రమం అందరి సహకారంతో నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి యిళ్ళ శేషగిరిరావు, ఎంపిడిఓ బి.కృష్ణమోహన్, గోడిలంక, బెండమూరులంక పిహెచ్‌సి వైద్యులు స్పందన, బాల సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచ్చిలి జెడ్‌పీ పాఠశాలలో గురువుల గ్రూపు తగాదాలు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు వారిలో వారు ఆరోపణలు చేసుకుంటూ విద్యాభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నారు . ఇరువురు ఉపాధ్యాయులు రాజకీయ నాయకుల సిఫార్సుతో మళ్లీ ఇదే పాఠశాలకు రావడంతో ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఇదే పాఠశాలలో పనిచేస్తున్న మరో ఉపాధ్యాయుడు సహకరిస్తున్నట్లు తెలుస్తుంది. తగాదాలు పడుతున్నారని జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియడంతో ఆయన వచ్చి నచ్చ చెప్పారు. అయినా ఫలితం లేకపోయింది. పరిస్థితి తీవ్ర రూపం దాల్చడంతో ఇరువురు ఉపాధ్యాయులను సెలవుపై వెళ్ళమని ఆదేశించారు. గతంలో ఈ పాఠశాలకు జిల్లాస్థాయిలో పేరు ప్రఖ్యాతులు ఉండేవి. అలాంటిది ఇటీవల కాలంలో గురువుల మధ్య కీచులాటలు జరగడంతో పరిస్థితి దిగజారిపోయింది. ఎవరైనా అధికారి వచ్చి విచారణ జరిపిన సంఘటనలు కూడా గోప్యంగా ఉంచుతూ పత్రికలకు తెలియకుండా జాగ్రత్తలు పడుతున్నారు. 12 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్న ఆత్రేయపురం మండల పరిధిలోని ఉచ్చిలి జెడ్‌పీ పాఠశాలలో గురువుల మధ్య గ్రూప్ తగాదాలతో విద్యార్థుల చదువులు సక్రమంగా సాగడం లేదనీ తల్లితండ్రులు వాపోతున్నారు.

గురువుల మధ్య గ్రూప్ తగాదాలు పరిష్కరించడంలో మండల అధికారులు విఫలం కావడంతో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభావం చూపించి ఉత్తీర్ణత శాతం తగ్గే ప్రమాదం ఉంది. విద్యాభ్యాసంపై శ్రద్ధ చూపించవలసిన విద్యార్థులు గురువుల మధ్య కీచులాటలు గమనిస్తూ విద్యాభ్యాసం గాలికి వదిలేస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులు తమతో పలు విషయాల్లో ఏకీభవించని ఇరువురు ఉపాధ్యాయులపై కక్షతో పాఠశాల నుంచి బదిలీ చేయించేందుకు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో వుంచుకుని రాజకీయాలు ప్రక్కన పెట్టి విద్యార్థులపై దృష్టి పెట్టాలని, విద్యాభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువత ఓటింగ్‌లో పాల్గొనాలి - వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి

అల్లవరం, మేజర్ న్యూస్ : 50 శాతం పైగా ఉన్న యువత రాబోవు ఎన్నికలలో ఓటింగ్‌లో పాల్గొనాలని, ప్రధాన భూమిక వహించాలని సిటిజన్స్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లం రెడ్డి లక్ష్మణ రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 29న గురువారం ఓడలరేవులోని బి.వి.సి. ఈ ఇంజనీరింగ్ కళాశాలలో ఓటు వేద్దాం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం అనే అంశంపై జరిగిన కళాజాత కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి విఎస్ఏ అధ్యక్షత వహించారు. వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ గత చట్టసభలలో ఒకప్పుడు త్యాగధనులు, మేధావులు, దేశభక్తులు ఉండేవారని నేడు క్రిమినల్స్, ధనార్జనపరులు, కాంట్రాక్టర్లు ఉంటున్నారని, ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారిందన్నారు. భారతదేశంలో అత్యధిక ఎన్నికల వ్యయం జరిగే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మారుతుందని, ఇసుక, మట్టి, గనుల మాఫియా, మద్యం మాఫియా, ఫ్యాక్షనిస్టులు ఎన్నికల రంగంలో దిగి పోటీ పడుతున్నారని అన్నారు. పట్టణ ప్రాంతాలలో ఓటింగ్ శాతం పెంచడానికి కళాజాతను అన్ని జిల్లాల జిల్లా కేంద్రాలలో నిర్వహిస్తున్నామన్నారు. అత్యున్నత ప్రజాస్వామ్య స్ఫూర్తిని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత గల మేధావులు మౌనంగా ఉంటే సమాజం నష్టపోతుందని తెలిపారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో అనేక లోపాలు జరుగుతున్నాయని వాటిని సరి చేసే బాధ్యత రాజకీయ పార్టీల స్థానిక నేతలు తీసుకోవాలని అన్నారు. వలంటీర్ల వ్యవస్థను ఎన్నికలకు దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా అధికార పార్టీ ఎన్నికలలో వలంటీర్లను ఉపయోగిస్తామని, వారిని పోలింగ్ ఏజెంట్లుగా, ఎన్నికల సైన్యంగా వాడుకుంటామని పేర్కొనటాన్ని తీవ్రంగా ఖండించారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి ప్రసంగిస్తూ ఓటు హక్కు రామబాణం లాంటిదని ఈ హక్కును విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకొని, మంచి పాలకులను ఎన్నుకోవాలని కోరారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నేత డాక్టర్ ఈ ఆర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రపంచంలోనీ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న ఇండియాలో అవినీతి రహిత, అభివృద్ధికి తోడ్పడే సుస్థిర పాలన అందించే ప్రభుత్వాలను ఎన్నుకోవాలని కోరారు. లోక్ సత్తా ఉద్యమ నేత ఉప్పుగంటి భాస్కరరావు ప్రసంగిస్తూ, డబ్బు, మద్యం లాంటి ప్రలోభాలకు లోనైఅనర్హులను గెలిపిస్తే సమాజం తిరోగమనస్తుందని తెలిపారు. కులము.మతము, ప్రాంతాల దురభిమానులకు లోను కాకుండా సమాజహితులను గెలిపించుకోవాలని కోరారు. కళాశాల డీన్ డాక్టర్ టీవీ జనార్దన్ రావు ప్రసంగిస్తూ రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఐదు సంవత్సరాలు గడిచాయని ఆవేదన వ్యక్తం చేస్తూ ఉత్తమ ప్రభుత్వాలను ఎన్నుకోవడం ద్వారా అభివృద్ధికి నాంది పలికాలన్నారు. ఈ సందర్భంగా రంగం ప్రజా సాంస్కృతిక వేదిక ఆర్ రాజేష్ నేతృత్వంలో 12 మందితో కూడిన కళాకారుల బృందం ఆట మాట పాటలతో ఓటర్లను జాగృతులను చేసే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సబికులను ఆలోచింప చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీపాద రామకృష్ణ స్వాగత ఉపన్యాసం చేశారు. వందలాది మంది విద్యార్థులు కళారూపాలను ఆస్వాదించి తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుంటామని, ఓటు అంబాసిడర్ గా మారి ఓటింగ్ శాతాన్ని పెంచడానికి కృషి చేస్తామని తెలిపారు.

జెఎన్టీయుకెలో 'యువ సంవాద్-ఇండియా 2047'

కాకినాడ, మేజర్ న్యూస్ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో గురువారం ఉదయం విసి కాన్ఫరెన్స్ హాలు నందు కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు యుసిఇకె ఎన్ఎస్ఎస్ యూనిట్-1, యూనిట్-2, యూనిట్-3 ఆధ్వర్యంలో భారతదేశ పంచప్రాణ్ యువజన సంభాషణ-భారత్ కే పంచ్‌ప్రాణ్-ఏక్ యువ పరిచర్చ్ అనే నినాదంతో యువ సంవాద్-ఇండియా 2047 కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమానికిముఖ్యఅతిథిగా కాకినాడ పార్లమెంట్ సభ్యురాలు వంగా గీతా విశ్వనాథ్ విచ్చేయగా విశిష్ట అతిథిగా ఉపకులపతి ప్రొ. జి.వి.ఆర్.ప్రసాదరాజు, గౌరవ అతిథులుగా రెక్టార్ ప్రొ. కె.వి.రమణ, రిజిస్ట్రార్ ప్రొ.ఎల్.సుమలత, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా.జి.శ్యామ్‌కుమార్‌లు పాల్గొనగా యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ. ఎంహెచ్ ఎం.కృష్ణప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా వంగా గీతా విశ్వనాథ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలకు భారతదేశం పరిష్కార మార్గాలు చూపిస్తోందన్నారు. మానవ కేంద్రిత అభివృద్ధి దిశగా ప్రపంచం పయనిస్తోందని, ఈ విషయంలో భారతదేశం ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని, 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు. విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు. ఉపకులపతి ప్రొ. జి.వి.ఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రస్తుతం మనం సాధించే ప్రగతి భవిష్యత్తు తరాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కోవిడ్-19 తర్వాత విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామన్నారు. జెఎన్‌టియుకెలో ఎన్ఎస్ఎస్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనంతరం పూర్వ విద్యార్థి గట్టి సత్యనారాయణ, పెద్దిరెడ్డి రవికిరణ్‌లు రీసోర్స్‌పర్సన్‌లుగా పాల్గొని కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు మరియు యువ సంవాద్-ఇండియా 2047 కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు.ఈ కార్యక్రమంలో ఇంక్యుబేషన్ సెంటర్ స్పెషల్ ఆఫీసర్ డా.ఎం.రమేష్, యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. యు.వి.రత్నకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు కె.రమణాజీ, ఎం.వి.ఎస్.వి.కిరణ్మయి, డా. పి.వీరలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా ఉమ్మడి ప్రణాళిక

వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ : గెలుపే లక్ష్యంగా జనసేన, తెలుగుదేశం పార్టీలు ఉమ్మడి ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్లాలని సీనియర్ నాయకులు,జడ్పీ.టి.సి.వాళ్ళ రంగారెడ్డి, కార్యకర్తలకుసూచనలు చేశారు.గురువారం తెలుగుదేశం మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాసరావు,నివాసంలో మండల ప్రధాన కార్యదర్శి బురకా కన్నారావు, అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా జడ్పీ.టి.సి.వాళ్ళ రంగారెడ్డి, మాట్లాడుతూ గెలుపే లక్ష్యంగా ఇరు పార్టీల కార్యకర్తలు పనిచేయాలని కోరారు.ఈ ప్రాంత ప్రధాన సమస్యైన పోలవరం నిర్వాసితులకు మొండి చెయ్యి చూపించింది నిజం కదాని ఆయన ప్రశ్నించారు. అధికారపార్టీ వ్యవహార,శైలిని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని కోరారు.అధికార పార్టీ ప్రభుత్వ ప్రజావేతిరేక విధానాలను ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. ఈ ఉమ్మడి సమావేశంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, వాణిజ్య విభాగం నియోజకవర్గ ఇంచార్జీ బీరక సూర్య ప్రకాష్ రావు,రేఖపల్లి బూత్ ఇంచార్జీ పెందుర్తి సుదర్శన్ రావు,మహిళా నాయకురాలు ఆకోజు భాగ్యలక్ష్మి, సోడి వెంకమ్మ,జనసేన మహిళా అధ్యక్షురాలు ప్రమీల,తదితరులు హాజరయ్యారు.

పవన్ నాలుగో భార్య నాదెండ్ల

- జమ్ములమడక నాగమణి

కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నాలుగో భార్య నాదెండ్ల మనోహర్ అని, ఇది రాష్ట్ర ప్రజలందరికీ తెలిసినదేనని రాష్ట్ర వైసిపి మహిళా విభాగం గోదావరి జిల్లాల కో-ఆర్డినేటర్, మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పౌరసరఫరాల సంస్థ రాష్ట్ర డైరెక్టర్ జమ్ములమడక నాగమణి తీవ్రస్థాయిలో పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేశారు. ఒక జాతి మొత్తాన్ని చంద్రబాబు దగ్గర తాకట్టు పెట్టావని నీ వ్యవహార శైలి చూస్తుంటే ఐదు కోట్ల ఆంధ్రులకు అర్థమవుతొందన్నారు. బుధవారం తాడేపల్లిగూడెంలో జరిగిన జనసేన, తెలుగుదేశం సభలో పవన్ కళ్యాణ్ మాటలపై గురువారం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. రాజకీయాలలో కనీస అవగాహన లేని నాయకుడు ఎవరన్నా ఉంటే అది పవన్ కళ్యాణ్ అన్నారు.

తాను సినిమాలు తీస్తానని కొంతమంది ప్రొడ్యూసర్ల వద్ద అడ్వాన్సులు తీసుకుని వాళ్ళకి డేట్స్ ఇవ్వకుండా వాళ్ళని అప్పులు పాలు చేస్తున్న వ్యక్తి పవన్ కళ్యాణ్ అని విమర్శించారు. అరుపులు, కేకలతో ఎదుటివారిపై బురద జల్లాలన్న ప్రయత్నం మంచిది కాదన్నారు. చంద్రబాబు దగ్గర ఉన్న కాల్ మనీ రాయుళ్లను తాట తీసి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి అక్క చెల్లెమ్మకు న్యాయం చేసిన ఘనత నువ్వు పేర్కొన్న ఐదుగురు రెడ్లు వల్లనేనని గ్రహించాలని హితవు పలికారు. నేడు రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు నేరుగా పేద ప్రజల అకౌంట్లోకి వెళుతున్నాయంటే కేవలం ఆ ఐదుగురు రెడ్లు నిరంతరం చేస్తున్న కృషి వల్లేనని పవన్ తెలుసుకుంటే మంచిదన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇసుకను దోచుకుని ఆ డబ్బులు ఆ పార్టీ నాయకులు తిన్నారని, నేడు ఆ డబ్బులతో జగన్ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు.

పేకాట,కోడి పందేలు లాంటి జూదాలు ఆడితే కఠిన చర్యలు

- పార్థసారధి

ఎటపాక, మేజర్ న్యూస్ : మండలంలో ఎక్కడైనా పేకాట, కోడి పందేలు లాంటి జూదాలు ఆడితే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని ఎటపాక ఎస్సై పార్థసారధి ఓ ప్రకటనలో తెలిపారు. జూదం అనే వ్యసనం, ప్రజల యొక్క జీవితాలను నాశనం చేస్తుందని, కొంతమంది కష్టపడ కుండా డబ్బులు సంపాదించడానికి పేకాట, కోడి పందేలు లాంటి జూదాలు ఆడుతున్నారని, వాటి వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆయన అన్నారు.

మండలంలో ఎక్కడైనా, ఏ గ్రామంలో అయినా పేకాట, కోడి పందాలు లాంటి జూదాలకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గొప్పగా ఉంచబడినని ఆయన తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనేవారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మండలంలో గట్టి నిఘా ఏర్పాటు చేయడం జరిగింది అని ఆయన అన్నారు.

రైతుల కష్టాలు పుడమి తల్లికి ఎరుక..

వి.ఆర్.పురం, మేజర్ న్యూస్: రైతు కాయకష్టం చేసి పంట పండించకుంటే కడుపు నిండే పరిస్థితి కానరాదాయె ..! కానీ రైతు కష్టాలు ఎవరికెరుక?అన్నదాత శ్రేమిస్తే ఐదువేళ్ళు,నోట్లోకి వెళ్తాయి.ఈసంగతి అందరికి తెలిసిందే! కానీ రైతులపైచేసే లాఠీచార్జీలు దేనికోసం,దేనికిసంకేతాలు! రైతేలేకపోతే!ఆకలితో అల మటించాల్సిందే!ఎండకు ఎండీ!వానకు తడిచి! రాత్రింబగళ్లు కష్టపడి,పొలంగట్లపై నిద్రించి, విషపూరిత కీటకాలను జయించి,పంటపండించి మనకు అందించేవాడే దేవుడు ఆదేవుడేరైతు!కానీ! ఆరైతుకే కష్టం వచ్చింది.చట్టాలను రైతులకు అనుకూలంగా లేకుండా చేస్తున్నారు.గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని రైతులను అన్నీ విధానాలు ఆదుకోవాలని కోరుకుందాం..

జిల్లా ఎస్పీ అధ్యక్షతన క్రైం రివ్యూ సమావేశం

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ అధ్యక్షతన క్రైం రివ్యూ సమావేశం గురువారం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలీసు విధుల నిర్వహణ, అంతర జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల నిర్వహణ, నిషేధిత పదార్థాల కట్టడి, వ్యక్తుల బైండ్ ఓవర్, పెండింగ్ ఎన్నికల సంబంధ కేసులలో పురోగతి, లైసెన్సెడ్ ఆయుధాల డిపాజిట్, ఎన్ఫోర్స్మెంట్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కేసులలో దర్యాప్తు విధి విధానాల అవగాహన అంశాల అజెండాగా ఎస్పీ ఈ సమావేశంలో సమీక్ష చేశారు.ఈ సమీక్షా సమావేశానికి జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, ట్రైనీ ఐపిఎస్, ట్రైనీ డిఎస్పీలు, సబ్ డివిజన్ పోలీసు అధికారులు, ఇతర విభాగాల పోలీసు అధికారులు, ఇన్స్పెక్టర్, సబ్ ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు హాజరయ్యారు.

పోలింగ్ రోజున తప్పకుండా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి

- ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధం

- గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదు చేసిన పి ఎస్‌ల సందర్శన

- ఓటర్లతో కలెక్టర్ మాధవీలత, జెసి తేజ్ భరత్ ముఖాముఖి

- జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్, మేజర్ న్యూస్ : రాజమండ్రి రూరల్ నియోజక వర్గ స్థాయి లో గత సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ తక్కువ నమోదు అయిన ప్రాంతాల్లో పర్యటించి ఓటర్ల ను చైతన్యం తీసుకుని రావడం జరిగిందనీ కలక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి కె. మాధవీలత పేర్కొన్నారు. బుధవారం రాజమండ్రి రూరల్ ఉన్న పోలింగ్ కేంద్రాలను నియోజక వర్గం ఆర్వో జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ తో కలిసి కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. మాధవీలత మాట్లాడుతూ, మన దేశంలో రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని, పోలింగ్ రోజున ఓటును తప్పకుండా వెయ్యాలని కోరారు. కొందరు ఓటర్లు సమయం కుదరక పోవడం వల్ల ఓటు వెయ్యలేదని తెలియ చెయ్యడం తో ఉదయం 7 గంటల నుంచి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ఎన్నికల విధుల్లో భాగస్వామ్యం అయ్యే ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఉదయమే ఓటు వేసి విధులను హజరు కావడం జరుగుతుందన్నారు . మీరు తప్పకుండా పోలింగ్ కేంద్రానికి వొచ్చి ఓటు వేయాలని తెలియచేశారు. ముఖ్యంగా యువత తమ ఓటు హక్కును వినియోగించుకునీ తమ బాధ్యత నిర్వర్తించాలని పేర్కొన్నారు. నియోజక వర్గంలో 2019 ఎన్నికల్లో 73.81 శాతం ఓటింగ్ నమోదు అయితే, కొన్ని కేంద్రాలలో 32 నుంచి 50లోగా , కొన్ని పి ఎస్ లలో 50 నుంచి 55 శాతం వరకే ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం గుర్తించినట్లు తెలిపారు. బి ఎల్ వో లతో మాట్లాడుతూ, నియోజక వర్గ సగటు కంటే తక్కువ పోలింగ్ జరిగిన పి ఏస్ వారిగా వివరాలు మీకు అందుబాటులో ఉంచామని , ఆయా ఓటరు జాబితా అనుసరించి , గతంలో ఓటు వెయ్యని వారీ వద్దకు వెళ్లి చైతన్యం తీసుకుని రావాలని తెలిపారు. గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువ గా నమోదు అయిన పోలింగ్ కేంద్రాల ఏరియాలలో ఇంటింటి ప్రచారం ద్వారా ప్రత్యేక స్వీప్ కార్య కలాపాలను చేపట్టాల్సి ఉందన్నారు. గత ఎన్నికల్లో నియోజక వర్గాల వారీగా తక్కువ ఓటు నమోదు చేసిన పి ఎస్ లను గుర్తించి, అన్నీ రాజకీయా పార్టీలతో కలిసి అక్కడ ప్రత్యేక ప్రచార కార్యక్రమాల ను ఆర్వో ఆధ్వర్యం లో చెప్పట్టాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ఓటర్ల తో సంభాషించిన కలక్టర్ రాజ్యాంగ కల్పించిన ఓటు హక్కును వినియోగించు కునేందుకు ఓటర్లు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. అందులో భాగంగానే రాజమండ్రీ రూరల్ నియోజక వర్గం పరిధిలోని పి ఎస్ లలో నియోజక వర్గం సగటు ఓటు నమోదు 73.81 శాతం కంటే తక్కువ నమోదు అయిన పీఏస్ 165 లో 32.08 శాతం , పీ ఎస్ 164 లో 33.23 శాతం , పి ఎస్ 186 లో 49.09 శాతం నమోదు అయిన ప్రాంతాల్లో పర్యటించి ఓటర్ల తో మాటామంతీ కలపడం జరిగింది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తప్పకుండా ఓటు హక్కును వినియోగించు కోవాలని మాధవీలత తెలియ చేశారు.

విద్యా బాలమందిర్‌లో మొరార్జీ దేశాయ్ 128 జయంతి వేడుకలు

కొత్తపేట, మేజర్ న్యూస్ : డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట విద్యా బాల మందిర్‌లో భారత మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ జయంతి సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆర్ అనురాధ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ 1896 ఫిబ్రవరి 29న గుజరాత్ రాష్ట్రంలో బల్సార్ జిల్లాలో భీడేలీ గ్రామంలో జన్మించారు. మనదేశానికి 4వ ప్రధానిగా 1977 మార్చి 24 నుండి 1979 జులై 26 వరకు పని చేసారు. ముంబాయిలో విల్సన్ కాలేజిలో విద్యా భ్యాసం పూర్తి చేశారు. జనతా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసారు. దాని ద్వారా ప్రజలకు మంచి పరిపాలన అందించారు. స్వాతంత్రం సమర యోధుడిగా పని చేసారు.ఆయనకు భారత రత్న అవార్డు లభించింది. ది స్టోరీ ఆఫ్ లైఫ్ అనే గ్రంధాన్ని రచించారు. గొప్ప దార్శనికుడు గొప్ప పరిపాలన దక్షుడు. భారత దేశం గర్వించదగ్గ గొప్ప మేధావిగా పేరు పొందారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని నివాళులు అర్పించారు.

ఆదిత్య ఫోరెన్సిక్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం

గండేపల్లి, మేజర్ న్యూస్ : సూరంపాలెం ఆదిత్య డిగ్రీ & పీజీ కళాశాల, ఫోరెన్సిక్ సైన్స్ విభాగం నందు భారతీయ శాస్త్రవేత్త అయినటువంటి నోబెల్ బహుమతి గ్రహితా సర్. సి. వీ. రామాన్ భౌతిక శాస్త్రం విభాగంలో 28 ఫిబ్రవరీ 1928లో రామాన్ చర్యను కనుగొన్నందుకు గాను నేడు భారత దేశ జాతీయ విజ్ఞానశాస్త్రీయ దినంగా పేర్కొంటున్నాం అని కళాశాల ప్రిన్సిపాల్ విలాస్ అనిల్ చవాన్ తెలియచేసారు. ఈ జాతీయ విజ్ఞానశాస్త్రీయ దినంను ఫోరెన్సిక్ సైంస్ట్రీ 2.0ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రవంలో ఫోరెన్సిక్ సైన్స్ విద్యార్థులు మరియు ఇతర కళాశాల విద్యార్థులు వివిధ పోటీలలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా పిఠాపురం డి ఎస్ పి కే ప్రమోద్ మరియు ఆంధ్రా మెడికల్ కాలేజీ విశాఖపట్నం నుండి డాక్టర్ ప్రమోద్ కుమార్ హాజరయ్యి విజ్ఞాన శాస్త్రం యొక్క గొప్పతనాన్ని మరియు ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలిచెప్పారు మరియు ఈ కార్యక్రమంలో భాగంగా క్రైమ్ సీన్ , క్విజ్, డ్రాయింగ్, షార్ట్ ఫిలిం పోటీలలో విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధినేత లు అయినటువంటి వైస్ చైర్మన్ డా.నల్లమిల్లి సతీష్ రెడ్డి మరియు డా. నల్లమిల్లి సుగుణ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ విలాస్ అనిల్ చవాన్ మరియు వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వర రావు, మేనేజ్మెంట్ స్టడీస్ ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న సూర్యచంద్ర

- ఆరోగ్యం బాగోకపోతే ఆస్పత్రిలో చేరు మా నాయకుడు జ్యోతుల నెహ్రూపై విమర్శలు చేస్తే సహించం -టిడిపి నేతలు

జగ్గంపేట, మేజర్ న్యూస్ : జగ్గంపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన టిడిపి నాయకులు ఈ సందర్భంగా ఎస్సీ ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కుంచె రాజా, జీను మణిబాబు, పాఠం శెట్టి రవి, మాట్లాడుతూ సూర్యచంద్ర మతిభ్రమించి మాట్లాడుతున్నాడని జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థులు ప్రకటించడం జరిగింది. జగ్గంపేట నుండి ఉమ్మడి అభ్యర్థిగా జ్యోతుల నెహ్రూని ప్రకటించడం నియోజవర్గం అంత స్వాగతించిందని అన్నారు. పొత్తు ధర్మంలో జ్యోతుల నెహ్రూ సీట్ ఇచ్చారు. ఆయన గెలుపుకి సహకరిస్తానని అన్నావు, మళ్లీ నీకు ఏం ఆఫర్లు వచ్చాయో తెలియదు గానీ జ్యోతుల నెహ్రూ కి మేము సహకరించేది లేదు అంటూ మీడియాలో మాట్లాడావు. రాజనగరం నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిగా జనసేన ను ప్రకటిస్తే అక్కడ టిడిపి అభ్యర్థి బొడ్డు వెంకటరమణ చౌదరి ఉమ్మడి అభ్యర్థికి మద్దతు తెలియజేశారు. కందుల దుర్గేష్ ఒక ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షులు అయ్యుండి కూడా ఎంతో హుందాతనంగా వ్యవహరించారు. వారిని చూసి అన్న బుద్ధి తెచ్చుకుని మసులుకోవాలని మా నాయకుడు జ్యోతుల నెహ్రూ ని కానీ మా అధినాయకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కానీ విమర్శిస్తే ఊరుకోమని వారన్నారు. జ్యోతుల నెహ్రూ నాటిన మొక్కలు మేమందరం అందులో ఒక మొక్క నువ్వు అది గుర్తుంచుకుని మాట్లాడాలని నువ్వు డబ్బులు ఎక్కడి నుంచి తెచ్చి ఖర్చు పెట్టావు సోషల్ మీడియాలో ఎన్నారైలు చెప్తుంటే మాకే ఆశ్చర్యంగా ఉందని ఇన్ని కోట్ల రూపాయలు వసూలు చేసి ఈరోజు శ్రీరంగనీతులు చెబుతున్నావంటే నిన్ను మించిన నటుడు ఎవరు ఉండరని నీ నటనతో ప్రజలను మోసం చేస్తే మోసపోవడానికి ఎవరు సిద్ధంగా లేరని అందరూ అన్ని గ్రహిస్తున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్త కొండబాబు, పాఠం శెట్టి కొండరాజులు, డేగల సత్తిబాబు పీల మహేష్, నే దూరి గణేష్, కోదూరి రమేష్, పలివెల యేసు రాజు, తుమ్మల కిషోర్, చేలికాని హరి, కుప్ప తాతారావు, గెద్దాడ సత్యవేణి, వాకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌కు కాపు ఉద్యమనేత మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం లేఖ

జగ్గంపేట, మేజర్ న్యూస్ : పవన్ కళ్యాణ్‌కు కాపు ఉద్యమనేత మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం లేఖ వ్రాశారు. ఆ లేఖలో ఈ విధంగా ...2019 ఎన్నికల ముందు కవాతు సందర్భంగా కిర్లంపూడి వస్తానని కబురు పంపారు. అయోధ్య వెళ్లి వచ్చిన తర్వాత కిర్లంపూడి వస్తానని మరొకసారి కబురు పంపారు. ఎటువంటి కోరికలు లేకుండా మీతో కలుస్తానని చెప్పాను. అన్ని వర్గాలకు న్యాయం జరగడం కోసం పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు నా వంతు కృషి చేయాలని ఎటువంటి ఫలితం ఆశించకుండా సేవా మీతో చేయించాలని అనుకున్నాను. మన ఇద్దరి కలయిక జరగాలని యావత్ జాతి బలంగా కోరుకున్నారు. వారందరి కోరిక మేరకు నా గతం, నా బాధలు, అవమానాలు, ఆశయాలు, కోరికలు అన్ని మరచి మీతో ప్రయాణం చేయడానికి సిద్ధపడ్డాను. రాష్ట్రంలో ఒక కొత్త రాజకీయ వరవడి తీసుకురావాలని చాలా బలంగా ప్రయత్నం చేద్దామని ఆశించాను. మీరు కూడా అదే ఆలోచనలో ఉన్నారని నమ్మాను, కానీ దురదృష్టవశాత్తు నాకు ఆ అవకాశం మీరు ఇవ్వలేదు. చంద్రబాబు నాయుడు జైల్లో ఉన్నప్పుడు టిడిపి క్యాడర్ మొత్తం బయటికి రావడానికి భయపడి ఇంటికే పరిమితమయ్యారు. అటువంటి కష్ట కాలంలో మీరు జైలుకు వెళ్లి వారికి భరోసా ఇవ్వడం అన్నది సామాన్య విషయం కాదు.చంద్రబాబు పరపతి విపరీతంగా పెరగడానికి ఎవరు ఎన్ని చెప్పినా మీరే కారకులని బల్లగుద్ది చెప్పగలను. ఏపీ ప్రజలు ఇంచుమించుగా అందరూ మిమ్మల్ని స్థానంలో చూడాలని తహతహలాడారని లేఖలో పేర్కొన్నారు.

ఎండి విలాయత్ అలీ విశ్రాంత జీవితం హాయిగా సాగాలి

ముమ్మిడివరం, మేజర్ న్యూస్ : జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖలో సుదీర్ఘ కాలం వివిధ హోదాలలో పని చేసి డివిజనల్ పౌర సంబంధాల అధికారిగా పదవీ విరమణ చేసిన ఎండి విలాయత్ అలీ విశ్రాంత జీవితం కుటుంబ సభ్యులతో సుఖ శాంతులతో గడపాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె. లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. గురువారం స్థానిక ఎయిమ్స్ కళాశాలలోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో కార్యాలయ సిబ్బంది పదవి విరమణ చేసిన డివిజనల్ పి ఆర్ ఓ ఎండి విలా యత్ ఆలీని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డి ఐ పి ఆర్ ఓ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కోనసీమ జిల్లాలో పాత్రికే యులకు అక్రిడేషన్ కార్డులు మంజూరులో డివిజనల్ పి ఆర్ ఓ విలాయత్ అలీ పూర్తి సహకారం అందించారన్నారు. తోటి సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ అంకిత భావంతో శాఖా పరమైన సేవలందిస్తూ పలువురి జిల్లాస్థాయి అధికారులు, పాత్రికేయుల ఆదరాభిమానాలను పొందారన్నారు. శాఖపరమైన కార్యకలాపాలు నిర్వహించడంలో మృదుస్వభావిగా పేరొందిన ఆలీ సిబ్బందితో ఒక కుటుంబంలో వ్యక్తి మాదిరి గా వ్యవ హరిస్తూ సిబ్బందిని నొప్పించకుండా చాకచక్యంగా విధులు నిర్వహించి మంచి గుర్తింపు పొందారన్నారు. సంయుక్త సమాచార కార్య నిర్వాహక ఇంజనీర్ కే శ్రీనివాస రావు మాట్లాడుతూ పౌర సంబం ధాల అధికారిగా ఎంతో క్లిష్టమైన పనులు నిర్వహించాల్సి ఉంటుం దని తన యొక్క శక్తి సామర్థ్యాలతో ఒక ప్రక్క జిల్లాస్థాయి అధికారులను, మరోపక్క పాత్రికే యు లను సమన్వయపరుస్తూ సమయ స్ఫూర్తితో విధి నిర్వ హణలో మంచి పేరు ప్రఖ్యాతులు గడిచారని తెలిపారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన విలాయత్ ఆలీ మాట్లాడుతూ సమాచార శాఖలో విధులు నిర్వహించడం ఒక సవాలు గా తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజాప్రతినిధులు అధికారులు, సమన్వయం చేసుకుంటూ పాత్రికేయు లకు పూర్తిగా సహకరించి విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు.ఉద్యోగ విధులు నిర్వర్తించిన ప్రతిచోట సిబ్బంది సహకారంతో సర్వీసును దిగ్విజయంగా పూర్తి చేయగలిగానని అదేవిధంగా అన్నిచోట్ల పాత్రికేయ మిత్రులు పూర్తి సహాయ సహకారాలు పూర్తిస్థాయిలో అందించారని ఈ సందర్భంగా ఆయన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. సిబ్బంది పలువురు ప్రసంగిస్తూ పదవి విరమణ చేసిన విలాయత్ ఆలీ సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటూ విశ్రాంత జీవితం సుఖమయంగా సాగాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీ, టైపిస్టులు కే భారతి శార్వాణి , కార్యాలయ రికార్డు అసిస్టెంట్ ఆర్.ఎస్ కుమార్, కార్యాలయ సభ్దార్దినేట్లు ఎన్ చిట్టి రాజు, ఎం సతీష్ కుమార్ జి రాజు, విఘ్నేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కోటలో ఎమ్మెల్యే రాజప్ప ఎన్నిక ప్రచారం

సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట పట్టణంలో పెద్దాపురం ఎమ్మెల్యే, నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి నిమ్మకాయల చిన రాజప్ప ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గురువారం ఉదయం స్థానిక మెహర్ కాంప్లెక్స్‌లోని శ్రీ లక్ష్మి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలను పార్టీ నాయకులతో కలసి చేపట్టారు. అనంతరం ప్రచారం వాహనం పై ఎక్కి గణపతి నగరం, మెహర్ కంప్లెక్స్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారన్ని చేపట్టారు. నియోజక అభివృద్ధికి రానున్న ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలోఎమ్మెల్యే తనయులు నిమ్మకాయల రంగనాగ్, పార్టీ నాయకులు అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, కంటే జగదీశ్, గుమ్మళ్ళ రామకృష్ణ, రాజా సూరిబాబు రాజు, పాల్గొన్నారు.

సూర్యచంద్ర ప్రవర్తన ఆవేదన కలిగిస్తుంది

- జనసేన క్రియాశీలక సభ్యులు సూర్యచంద్ర అన్నయ్య బాబ్జి

జగ్గంపేట, మేజర్ న్యూస్ : జగ్గంపేట జనసేన పార్టీ ఇన్చార్జి పాఠం శెట్టి సూర్యచంద్ర అన్నయ్య జనసేన క్రియాశీలక సభ్యులు పాఠంశెట్టి బాబ్జి మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ పొత్తులో భాగంగా టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థిగా జ్యోతుల నెహ్రూని ప్రకటించిన వెంటనే కిర్లంపూడి మండలం పాలెం గ్రామం నుండి గోకవరం మండలం అచ్చుతాపురం వరకు పాదయాత్ర చేసుకుంటూ వెళ్లిన నా తమ్ముడు సూర్యచంద్ర. నేను నిరాహార దీక్ష చేస్తున్నానని జ్యోతుల నెహ్రూకి ఎన్నికల్లో మద్దతు ఇవ్వనని ప్రకటించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఒకవైపు సోషల్ మీడియాలో ఎన్నారైలు వద్ద కోట్ల రూపాయలు వసూలు చేశారని ఫేస్ బుక్ వాట్సప్ లలో కథనాలు చూసి చాలా సిగ్గు పడుతున్నానని అన్నారు. నా తమ్ముడు సూర్యచంద్రకి ఉమ్మడిలో పొలం నాలుగు ఎకరాలు పంచుకోగా 2006 ప్రాంతంలో పోలవరం కాలువ కాంట్రాక్ట్ తీసుకుని లారీలు కొనుక్కుని అప్పుల పాలు అయ్యాడని అప్పుడు మా ఉమ్మడి పొలంలో మరో రెండు ఎకరాలు ఇవ్వగా ఆరు ఎకరాలు అమ్ముకున్నాడని తన మామగారు ఇచ్చిన ఇల్లు, ఇంటి స్థలం కూడా అమ్ముకుని అప్పులు తీర్చుకున్నారని అయినా అప్పులు తీరలేదని అన్నారు. మరి నేను రాజకీయాల్లోకి వచ్చి ఐదు సంవత్సరాల నుంచి 15 ఎకరాలు అమ్ముకున్నాను అంటున్నావు కదా ఈ పొలం నీకు ఎక్కడి నుంచి వచ్చింది. ఇప్పుడు ఎన్నారైలు చెబుతున్నట్టుగా వారి దగ్గర దండిన డబ్బుతో కొన్నావా. అని అన్నయ్య బాబ్జి సూర్యచంద్రని ప్రశ్నించారు. వార్డు స్థాయి నుంచి సర్పంచ్ మండలస్థాయి నాయకులుగా చేసింది జ్యోతుల నెహ్రూ అలాగే ఒక ఎమ్మెల్యే అభ్యర్థి స్థాయి నుండి రాష్ట్ర స్థాయి నాయకుడిగా నిన్ను తీసుకొచ్చిన ఘనత జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కాదా అటువంటప్పుడు వారిని దుర్భాషలాడడం నీ అవివేకమని నీవల్ల మన పాఠం శెట్టి వారందరూ ఏ విధమైన ఫంక్షన్లకు వెళ్లలేని స్థితిలో ఉన్నారని ఎక్కడకు వెళ్లినా ఎన్నారైల దగ్గర మీ వాడు కోట్ల రూపాయలు దండుకున్నాడని ఆక్షేపణ చూస్తుంటే చాలా బాధగా ఉందని సూర్యచంద్ర అన్నయ్య పాఠంశెట్టి బాబ్జి ఆవేదన వెలిబుచ్చారు.

సమరానికి సిద్ధమవుతున్న నాయకులు

- మాటలతో ముగిస్తారా -చర్చలు సాగిస్తారా

- రసవత్తరంగా మారిన అనపర్తి రాజకీయం

అనపర్తి, మేజర్ న్యూస్ : అనపర్తి రాజకీయం రసవత్తరంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. వైఎస్ఆర్సిపి అధికారం చేపట్టినప్పటి తరువాత రాష్ట్రంలో సంచలమైన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే అవినీతిపై జరిగిన సత్య ప్రమాణం వంటి పరిణామాల వల్ల వైసిపి,టిడిపి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు విల్లు ఎక్కుపెట్టి వదులుకుంటూ వున్నారు. ఇప్పటి వరకు మాటలతోనే సరిపెట్టు కున్నారు. కానీ మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్థానిక ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డికి అవినీతి ఆరోపణలు విషయంలో చర్చలకు గాని, సత్య ప్రమాణానికి గాని రావాలని పిలుపునిస్తే, స్థానిక ఎమ్మెల్యే ఏ విధమైన సమాధానం చెప్పకపోవడంతో మాజీ ఎమ్మెల్యే స్వయంగా ఎమ్మెల్యే ఇంటికి, ఆసుపత్రికి వెళ్లి అవినీతి ఆరోపణల విషయములు చర్చించడానికి నేను సిద్ధమని, మీరు కూడా చర్చకు రావాలని ముద్రించిన కర్రపత్రాలను స్వయంగా అక్కడ సిబ్బందికి అందించడంతో అనపర్తి రాజకీయం ఒక్కసారిగా వేడి పుంజుకుంది. కరపత్రాలు పంచిన సమయంలో ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో మాజీ ఎమ్మెల్యే మరో అడుగు ముందుకేసి మార్చి 1 తారీకున ఎమ్మెల్యే ఇంటికి చర్చకు వస్తున్నట్లుగా సవాల్ చేశారు. దీంతో ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పై నిప్పులు చెరిగారు. దమ్ముంటే మార్చి 1 తారీఖున నా ఇంటికి కానీ, నా ఆస్పత్రిలో వద్దకు గాని వచ్చి దాడికి పాల్పడితే ఏ శాల్తీ కి ఆ శాల్తీ తీసేస్తానని మాజీ ఎమ్మెల్యేకి మాస్ వార్నింగ్ ఇవ్వడంతో రాజకీయం రంజుగా మారింది. ఈ పరిణామాలని చూస్తున్న ప్రజలు అసలు చర్చలు జరుగుతాయా అన్న సందేహం వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేని హౌస్ అరెస్టు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఒకవేళ చర్చలో జరిగితే ఆ ప్రాంతం రచ్చ రచ్చ అవుతుందని యుద్ధానికి కూడా ఎవరు ఎనకడుగు వేసేలా లేరని ప్రజలు అనుకుంటున్నారు. అయితే ఒకరిపై ఒకరు చర్చకు సిద్ధమా... యుద్ధానికి సిద్ధమా... సత్య ప్రమాణానికి సిద్ధమా... అని సవాళ్లు విసురుకుంటున్నారు. దేనికైనా సిద్ధమని ఇద్దరు ప్రధాన నాయకులు చెబుతున్న శాంతి భద్రతల దృశ్య ఇద్దరినీ దరి చేరనివ్వరని అనుకుంటున్నారు. బహిరంగ చర్చకు ఇరు పార్టీలు ఎవరి ఏర్పాట్లు వాళ్లు చేసుకుంటున్నారు. బహిరంగ చర్చ జరిగితే ఏ అంశాలపై చర్చ జరుగుతుంది అని ప్రజల ఆసక్తికి ఎదురుచూస్తున్నారు. ఈ పరిణామాలు రానున్న సార్వత్రిక ఎన్నికలు పై పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ మాటల యుద్ధం దేనికి దారితీస్తుందో వేచి చూడాలి.

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ నందు దంతాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు

గండేపల్లి, మేజర్ న్యూస్ : ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో దంతాల సం రక్షణ మరియు పరిశుభ్రత డెంటల్ హైజిన్ గురించి 29/02/24 న అవగాహన సదస్సు జరిగింది. ఈ ప్రోగ్రాంలో డాక్టర్ కేజేసిఎల్ స్వరూప (బీడీఎస్) దంత సమస్యలను గురించి దంతాలు యొక్క పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డా.కె.రవిశంకర్ మాట్లాడుతూ దంతాల యొక్క పరిశుభ్రత చాలా అవసరం అని వివరించారు. అలాగే డాక్టర్ స్వరూప దంతాల యొక్క సమస్యల గురించి, నోటి పరిశుభ్రత ఎంత ప్రముఖ్యత ఎటువంటి మంచి ఆహారం తీసుకోవాలి ఏ విధంగా మన దంతాలను పరిరక్షించుకోవాలి విద్యార్థిని విద్యార్థులకు ఈ సెమినార్లో వివరించారు. డాక్టర్ కే జే సి ఎల్ స్వరూప ఇచ్చిన సందేశమును పిల్లలకు ఎంతో అవగాహనగ కల్పించింది. ఈ సందర్భంగా డాక్టర్ స్వరూప గారిని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ మరియు స్టాఫ్ ఆమెను సత్కరించారు. విద్యార్థిని విద్యార్థులు మరియు వైదేహి, దివ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ అయిన ప్రశాంతి మరియు తదితర స్టాఫ్ మెంబర్స్ అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- స్పోర్ట్స్‌లో నేషనల్‌కి ఎంపికైన విద్యార్థికి ఆర్థిక సహాయం
- మెగా వాకర్స్ క్లబ్ ద్వారా 25 వేలు అందజేత

కాకినాడ, మేజర్ న్యూస్ : ఆటల్లో ప్రతిభలు కనబరిచిన విద్యార్థులకు మేగా వాకర్స్ క్లబ్ ముందుంటుందని ఎఫ్.హెచ్.పేట ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గురువారం ఎమ్.ఇ.ఒ. చేతుల మీదుగా జెడ్.పి.హెచ్.ఎస్. ఎ.పి.ఎస్.పి. విద్యార్థిని చాందినికి రూ.25 వేలు నగదును కాకినాడ మెగా వాకర్స్ క్లబ్ ద్వారా ఎఫ్.హెచ్.పేట ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం స్పోన్సర్ చేయడం జరిగినది. మాస్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆటల్లో ప్రతిభలు కనబరిచిన విద్యార్థులకు మేగా వాకర్స్ క్లబ్ ముందుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెగా వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ సిహెచ్ పద్దరాజు (రాజా), వైస్ ప్రెసిడెంట్ గుత్తుల శ్రీనివాస్ (జిఎస్), నాని, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్య రాజు, ఎమ్.ఇ.ఒ.2 పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి

ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున ఈవీఎంలపై అవగాహన ఉండాలని తాసిల్దార్ ఎం.వెంకటరామయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర రావులు అన్నారు. గురువారం మండల మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల పోలింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో వారు పలు సూచనలు చేశారు. ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో అత్యంత జాగ్ర త్తలు పాటించాలన్నారు.ఎటువంటి సమస్యలు ఎదురుకాకుండా చూసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు పి.వి.ప్రసాద్‌రావు, పచ్చ సాహెబ్, మాస్టర్ ట్రైని ఎస్.ప్రసాద్, మండలంలోని అందరు మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ పర్యవేక్షణ అధికారుల శిక్షణా తరగతులు

- ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలి
- ఖర్చుల విషయంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు మోడల్ ప్రవర్తనా నియమావళి పాటించాలి
- జేసి తేజ్ భరత్

రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ : ఎన్నికల ఖర్చుపై రాజకీయ పార్టీలు మరియు అభ్యర్థుల మార్గదర్శకాలనీ,ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మోడల్ ప్రవర్తనా నియమావళి ఖచ్చితంగా పాటించేలా ఎన్నికల వ్యయ పరిశీలకులు పర్యవేక్షణ బాధ్యతలను నిర్వర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ స్పష్టం చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికల నియోజక వర్గ వ్యయ పర్యవేక్షణా అధికారుల శిక్షణ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా జేసీ తేజ్ భరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ,ఎన్నికలప్రవర్తనానియమావళిఅమలుపై ఎంసీసీ బృందాలు, ఏఈఆర్‌ఓలు, ఫ్లయింగ్ స్క్వాడ్,సిట్టింగ్‌స్క్వాడ్, వ్యయ పరిశీలకులు, పోలీసు అధికారులు ఇతర ముఖ్య సిబ్బందికి మాస్టర్ ట్రైనర్‌ల అధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న రోజుల్లో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు తావులేకుండా ఓటర్లు తమ ఓటు హక్కును పూర్తి పారదర్శకంగా వినియోగం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆ క్రమంలో క్షేత్ర స్థాయిలో విధులను నిర్వర్తించేఎన్నికల ఖర్చుల నియంత్రణ పరిశీలకుల బృందాలు పూర్తీ స్థాయిలో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. డబ్బు వినియోగంపై దృష్టి పెట్టాలని కోరారు. ఎన్నికలలో మితిమీరిన, అక్రమ ఖర్చులే అవినీతికి మూలకారణం అని పేర్కొన్నారు. నగదును తీసుకెళ్లడం చట్టం ప్రకారం చట్టవిరుద్ధం కాదు కానీ భారీ నగదు లావాదేవీ అనుమానాన్ని సృష్టిస్తాయని అన్నారు. ఎన్నికల సమయంలో భౌతికంగా అటువంటి నగదు లావాదేవీలు వాటి విషయంలో సహేతు కమైన పత్రాలు దగ్గర ఉంచుకోవాలి అని పేర్కొన్నారు. అటువంటి సమయంలో సహేతుకమైన కారణం బహిర్గతం చెయ్యకపోతే, ఆదాయపు పన్ను శాఖ స్వాధీనం చేసుకోవచ్చునని తెలిపారు. చట్టపరమైన నిబంధనలు, ఆదాయపు పన్ను చట్టాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితం గా పాటించాలని పేర్కొన్నారు. కోడ్ అమల్లోకి వచ్చిన దగ్గరనుంచి సిబ్బంది అంతా భారత ఎన్నికల సంఘం ఆధీనంలోనే పనిచేస్తారని చెప్పారు. కమిషన్ ఇచ్చిన నిబంధనల మేరకు పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతిఒక్కరూ నిష్పాక్షికంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఏమైనా సందేహాలు తలెత్తితే నివృత్తి చేసుకోవాలని సూచించారు. బృందంలో తప్పనిసరిగా వీడియో గ్రాఫర్‌ను నియమించి సరైన పద్ధతిలో వీడియో రికార్డ్ చేయించాలని, తగిన ఆధారాలు దగ్గర ఉంచుకోవాలి అని పేర్కొన్నారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ లు సిహెచ్. భరద్వాజ శ్రీనివాస్, ఏ. నాగేశ్వర రావు, ఎ. ఉషాశ్రీలు చట్టపరమైన నిబంధనల ఆధారంగా ఎన్నికల వ్యయాన్ని వర్గీకరించడం జరిగిందని పేర్కొన్నారు. వాటిలో చట్టపరమైన వ్యయం బహిరంగ సమావేశాలు, పోస్టర్లు, బ్యానర్లు, వాహనాలు మొదలైనవి కాగా, అక్రమ వ్యయం డబ్బు, బహుమతులు, మద్యం లేదా ఓటర్లను ప్రభావితం చేసే ఉద్దేశ్యంతో వారి మధ్య ఏదైనా ఇతర వస్తువుల పంపిణీ అని పేర్కొన్నారు. పోటీలో నిలబడే అభ్యర్థి ఇలాంటి ఖర్చులకు స్వస్తి చెప్పాల్సి ఉంటుందనీ అన్నారు. కావున క్షేత్ర స్థాయిలో పర్యటించే వ్యయ పరిశీలనా బృందాలు అటువంటి వాటిపై దృష్టి పెట్టడం చాలా అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో రుడా ప్రాజెక్ట్ అధికారి జి. కోటయ్య, మాస్టర్ ట్రైనర్‌లు సిహేచ్. భరద్వాజ శ్రీనివాస్, ఏ.నాగేశ్వరరావు,ఎ.ఉషాశ్రీలు, వ్యయ పరిశీలకులు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు జన విజయకేతన జెండా సభతో తాడేపల్లి ప్యాలెస్ వణుకుతుంది - కొండబాబు

కాకినాడ, మేజర్ న్యూస్ : తాడేపల్లిగూడెం ప్రత్తిపాడు నందు తెలుగుదేశం జనసేన పార్టీలు ఉమ్మడిగా నిర్వహించిన తెలుగు జన విజయకేతన జెండా సభతో జగన్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు మొదలు ఆయ్యాయని కాకినాడ సిటీ తెదేపా ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు తెలిపారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు, వైసీపీ నాయకులు దందాలకు వ్యతిరేకంగా తేదేపా జనసేన పార్టీలు పోరాడుతూ ప్రజాపక్షాన ప్రజలకు అండగా నిలబడడం జరుగుతుందని, నిన్న జరిగిన టీడీపీ జనసేన తాడేపల్లిగూడెం సభను చూసి తాడేపల్లి పాలేస్ దద్దరిల్లిందన్నారు. రాబోయే ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం, అధికారం కోసం తెలుగుదేశం జనసేన పార్టీలు కలవలేదని, రాష్ట్ర భవిష్యత్తు కోసం తెలుగుదేశం జనసేన కలిసి ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రజలు పెట్టుకున్న కూటమి ఇది అన్నారు. జగన్ రెడ్డి తన స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని విధ్వంసంలోకి తీసుకెళ్లాడని, గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పేదవాడి కోసం అన్న క్యాంటీన్లు తెరిచి పేదలకు రూ.5 తో భోజనం పెడితే జగన్ రెడ్డి వాటిని మూయించి సైకో ఆనందం పొందుతున్నాడని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వ పాలనలో ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్న రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం సూపర్ 6 సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రజల సొమ్మును దోచుకొని జగన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాడని, రానున్న తెలుగుదేశం జనసేన ఉమ్మడి ప్రభుత్వ ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి, యువతకు ఉద్యోగాలు అవకాశాలు కల్పించడం జరుగుతుందని, టీడీపీ జనసేన కూటమితో వైసిపి పార్టీలో బీటలు మొదలయ్యాయని పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యం

- ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

చింతూరు, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం చింతూరు మండలంలో చిడిమూరు సచివాలయంలో పాలగూడెం, నరసింహపురం, చిడిమూరు గ్రామాల పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధనలక్ష్మి.. గ్రామలలో ప్రతి ఇంటికి వెళ్లి ఈ నాలుగు సంవత్సరాలు కాలంలో మన ప్రభుత్వంలో మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఆయా పథకాల ద్వారా లబ్ధిదారులకు నగదు ఎంత వచ్చిందో కూడా తెలియజేశారు. రానున్న కాలంలో కూడా ఈ సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేస్తామని తెలియజేశారు. అర్హత ఉండి, సంక్షేమ పథకాలు అందనివారికి సరిచేసి, అర్హులైన వారందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చింతూరు మండల కన్వీనర్, ఎంపీపీ, జడ్పిటిసి, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, సొసైటీ ప్రెసిడెంట్, వివిధ కార్పొరేషన్ చైర్మన్ డైరెక్టర్ కోఆప్షన్ నెంబర్, వైస్ సర్పంచులు, వార్డ్ మెంబర్లు, సచివాలయం కన్వీనర్లు గృహసారథులు, మాజీ సర్పంచ్లు మాజీ ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్ఎస్ఎమ్ఈ సర్వే కు సహకరించి విజయవంతం చేయండి

కాకినాడ, మేజర్ న్యూస్ : ఎమ్ఎస్ఎమ్ఈల పని తీరును మెరుగు పరచడం మరియు అభివృద్ధిని వేగవంతం చేయడం కోసం ప్రపంచ బ్యాంక్ వారి ఆర్థిక సహకారంతో కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ (ఆర్.ఎ.ఎం.పి.) అనే స్కీమును ప్రకటించిందని, ర్యాంప్ లోని ఒక అంశమైన ఎమ్ఎస్ఎమ్ఈల ఫార్మలైజేషన్ లో భాగంగా రాష్ట్రంలోని అన్నీ ఎమ్ఎస్ఎమ్ఈ లను సర్వే చేయడం కోసం ప్రభుత్వం పరిశ్రమల శాఖ ద్వారా జీవో జారీ చేసిందని, ఈ సర్వే ద్వారా తయారీ, సేవ మరియు వాణిజ్య రంగాలలోని అన్నీ ఎమ్ఎస్ఎమ్ఈ లను సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్ ఫామ్ లోనికి తీసుకువచ్చి ఏపీ ఎమ్ఎస్ఎమ్ఈ వన్ పోర్టల్ కు అనుసంధానించడం, నమోదు కాని వ్యాపారాలను ఉద్యం మరియు ఉద్యమ అసిస్ట్ లో నమోదు చేయడంను ఈ ఎమ్ఎస్ఎమ్ఈ ఫార్మలైజేషన్ యొక్క ముఖ్య ఉద్దేశమని, జిల్లాలోని ఎమ్ఎస్ఎమ్ఈ లు, ఎమ్ఎస్ఎమ్ఈ అసోసియేషన్లు, ఇతర పరిశ్రమల అసోసియేషన్లు, వర్తక, వాణిజ్య సంఘాలు సర్వే టీం కు సహకరించి సర్వేకు అవసరమైన వివరాలు అందించి సర్వేను విజయవంతం చేయవలసినదిగా జిల్లా పరిశ్రమల అధికారి టి.మురళి ఒక ప్రకటనలో కోరారు. కమిషనర్ పరిశ్రమలశాఖ ఏపీ ఎమ్ఎస్ఎమ్ఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి సహకారంతో ఈ సర్వే నిర్వహిస్తారన్నారు. ఈ సర్వే కోసం ఎమ్ఎస్ఎమ్ఈ సర్వే అండ్ సపోర్ట్ అనే మొబైలు యాప్‌ను రూపొందించడం జరిగినదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు మరియు పట్టణ ప్రాంతాలలో వార్డ్ ఎమినిటి సెక్రేటరీస్ ఈ సర్వే 01.03.2024 నుంచి 20.03.2024 వరకు చేస్తారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు మరియు అడిషనల్ డెవలప్మెంట్ కమిషనర్ల ద్వారా ఈ సర్వే పురోగతిని జిల్లా పరిశ్రమల కేంద్రం, జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తుందన్నారు.

ఈ సర్వే ద్వారా రాష్ట్రంలోని ఎమ్ఎస్ఎమ్ఈ ల డేటా బేస్ ను అభివృద్ధి చేయడం, వివిధ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కల్పించడం, మహిళలు మరియు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల నైపుణ్యాలను అభివృద్ధి పరచటం మొదలైన సేవలను ఎమ్ఎస్ఎమ్ఈ లకు కల్పించడం జరుగుతుందన్నారు. సర్వే గుర్తించిన నమోదు కానీ ఎమ్ఎస్ఎమ్ఈ లకు అవగాహన శిబిరాలను నిర్వహించి ఉద్యం లేదా ఉద్యమ అసిస్ట్ ద్వారా నమోదు చేస్తారని తెలిపారు. ఇలా చేయడం వల్ల వివిధ రకాల ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందేందుకు అర్హులు అవుతారని, బ్యాంకు ఋణ సదుపాయాలు సులభతరం అవుతాయని, ఎమ్ఎస్ఎమ్ఈ ల డిలేడ్ పేమెంట్లను సమాధాన పోర్టల్ తో అనుసంధానించడం ద్వారా తగ్గించవచ్చునన్నారు. కావున జిల్లాలోని ఎమ్ఎస్ఎమ్ఈ లు, ఎమ్ఎస్ఎమ్ఈ అసోసియేషన్లు, ఇతర పరిశ్రమల అసోసియేషన్లు, వర్తక, వాణిజ్య సంఘాలు సర్వే టీం కు సహకరించి సర్వేకు అవసరమైన వివరాలు అందించి సర్వేను విజయవంతం చేయవలసినదిగా కోరారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం

గోపాలపురం, మేజర్ న్యూస్ : ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. జనరల్, ఒకేషనల్ ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సర వార్షిక పరీక్షలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల ఆశ్రమ బాలికల పాఠశాలలో, స్థానిక శ్రీ గౌతమీ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నారు. గురుకుల పాఠశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 600 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 400 మంది మొత్తం కలిపి 1000 మంది పరీక్షలు రాస్తారని, శ్రీ గౌతమి జూనియర్ కళాశాలలో జనరల్, ఒకేషనల్ విద్యార్థులు మొత్తం 495 మంది పరీక్షలు రాస్తారని గురుకులు పాఠశాల ప్రిన్స్‌పల్ సిఎస్.టి. ఉమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం 13 గదులను ఏర్పాటు చేశా మని ఒక్కొక్క గదిలో 30 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారని చెప్పారు. మార్చి 1వ తేదీ నుండి 18 వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయ న్నారు. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా గౌతమి కళశాలలో 20 గదులను ఏర్పాటు చేసి వాటిలో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు ఏర్పాటు చేశామన్నారు.ఈ పరీక్షల నిర్వహణ డిపార్ట్మెంటల్ ఆఫీసర్లుగా సి.వి.వి.సాంబశివరావు,వై రత్నరాజు వ్యవహరిస్తారన్నారు.

అభివృద్ధిలో ఏపీ అగ్రస్థానం

- దేశంలో ఎక్కడా జరగని విధంగా కార్యలయాల నిర్మాణం
- మండలంలో పలు గ్రామాల్లో ఆర్బీకేలను ప్రారంభించిన మంత్రి వనిత

గోపాలపురం, మేజర్ న్యూస్ : దేశంలో ఎక్కడా జరగని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి జరిగిందని రాష్ట్ర హోమంత్రి తానేటి వనిత అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రలు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రన్ని తీర్చిదిద్దామని ఆమె పేర్కొన్నారు. గోపాలపురం మండలంలోని గురువారం ఆయా గ్రామాల్లో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ ఆరోగ్యకేంద్రాలు, గ్రామ సచివాలయాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడ జరగని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సచివాలయ వ్యవస్థను జగన్ తీసుకువచ్చారని చెప్పారు.

సచివాలయం పరిధిలోనే అన్ని రకాల సేవలు అందించేలా వ్యవస్థలో సంస్కరణలు తీసుకువచ్చారని చెప్పారు. అందులో భాగమే భరోసా కేంద్రాలు, వైఎస్సార్ ఆరోగ్యకేంద్రాలు అని ఆమె తెలిపారు. గోపాలపురం మండలం సంజీవపురం గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం.. సంజీవపురం శివారు రేగులకుంటలో వైఎస్సార్ హెల్త్ సెంటర్ ప్రారంభించారు. దొండపూడి గ్రామంలో రూ.44.74 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ సెంటర్‌లను ప్రారంభించారు. సగ్గొండ (గోపవరం) గ్రామంలో రూ.65.94లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. గోపాలపురం మండలంలో సంజీవపురం, దొండపూడి, సగ్గొండ పంచాయతీల పరిధిలో మొత్తం దాదాపు రూ.కోట్ల రూపాయల వ్యయంతో జగనన్న ప్రభుత్వం నిర్మించిన ప్రాధాన్యత భవనాలను హోంమంత్రి తానేటి వనిత ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారమే సిఎం ఆకాంక్ష

- సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ, మేజర్ న్యూస్ : అర్హత కలిగిన ప్రతిఒక్కరికి గృహనిర్మాణం,విద్య,వెద్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రాధాన్యాతలని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. సిటీ నియోజకవర్గ లబ్ధిదారులకు స్థలాలు కేటాయించిన కొమరగిలే అవుట్‌ను ఎమ్మెల్యే ద్వారంపూడి గురువారం సందర్శించారు.17,22,23,24 డివిజన్లకు సంబంధించిన లబ్ధిదారులను బస్సులలో తీసుకెళ్ళి అక్కడ జరుగుతున్న గృహనిర్మాణాలను చూపించారు. కాకినాడలో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి సొంతింటి కల సాకారం చేయాలన్నదే తన లక్ష్యమన్నారు. ఇందుకోసం గత ఎన్నికలకు ముందు పదివేలమందికి ఇళ్ళ స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చినప్పటికీ దాదాపు 30వేల మందికి పంపిణీ చేసామన్నారు. ఇచ్చిన స్థలాలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా వేగంగా జరుగుతుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సదరు స్థలంపై లబ్ధిదారునికి సంపూర్ణ హక్కు లభించాలనే ఆకాంక్షతో సియం జగన్ రిజిస్ట్రేషన్లు అప్పగించాలని నిర్ణయించారన్నారు. దేశంలో ఎక్కడా ఇంత పెద్ద ఎత్తున ఇళ్ళ స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవని ఒక్క ఏపీలోనే 30లక్షల మందికి ప్రభుత్వం పట్టాలిచ్చి గృహనిర్మాణం చేపట్టిందన్నారు. పేదల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేసారు. అధికారంలో ఉండగా ఏ ఒక్కరికి గజం స్థలం ఇవ్వని తెలుగుదేశం పాలకులు తాము అధికారంలోకి వస్తే రెండు సెంట్లు స్థలం ఇస్తామని ప్రజలకు తప్పుడు వాగ్దానాలు చేస్తున్నారని వీరి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్సీపీ నగర అ్యధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నగర పాలకసంస్థ కార్యదర్శి ఎమ్ యేసుబాబు, జేసీయస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్,పెద్ద సంఖ్యలో మాజీ కార్పోరేటర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి గురువారం వి.ప్రభాకర్‌రావు, తులసి మహాలక్ష్మి దంపతులు రూ.50 వేలు విరాళంగా అందించారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, డిప్యూటీ కమిషనర్ భూపతి రాజు కిషోర్ కుమార్, కమిటీ సభ్యులు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

సేవాభివృద్ధే చిరంజీవిరెడ్డి ఆశయం - డా॥ టి.వి

కాకినాడ, మేజర్ న్యూస్ : రోటరి గోల్డెన్ జూబ్లి క్లబ్ పూర్వాధ్యక్షులు చిరంజీవిరెడ్డి 56వ జన్మదినోత్సవ వేడుకలు రోటరి బ్లడ్ బ్యాంక్‌లో గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న డా॥ టి.వి.బాలకృష్ణ మాట్లాడుతూ సేవా రంగంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు మహిళా విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసారని చిరంజీవి రెడ్డిని కొనియాడారు. రోటరి గోల్డెన్ జూబ్లి క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించబ డుతున్న రోటరి వృద్ధాశ్రమ మరియు రోటరి బ్లడ్ బ్యాంక్‌ల అభివృద్ధికి కూడా విశేషంగా కృషి చేసారన్నారు. పదివేల యూనిట్ల రక్తాన్ని సేకరించి నూతన రికార్డ్‌ను నమోదు చేసుకున్నారని గుర్తు చేసారు. రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షుడు నల్లమిల్లి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ సమాజ అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వాటిని నెరవేర్చడంలో మిత్రుల భాగస్వామ్యంతో అనేక కార్యక్రమాలను నిర్వహించి అందరికీ మార్గదర్శకులయ్యారని అభినందించారు. గోల్డెన్ జూబ్లి క్లబ్ పూర్వపు కార్యదర్శి కర్రి బుచ్చిరెడ్డి మాట్లాడుతూ పి.ఆర్. బాలికోన్నత పాఠశాలలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలిస్తే విద్యాభివృద్ధికి చేసిన కృషి సత్ఫలితాలు ఇవ్వడమే కాక మంచి ఫలితాలను నమోదు చేసారని అభినందించారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు అవసరమైన నూతన భవనాల నిర్మాణానికి కూడా ప్రత్యేక దృష్టి సారించి అందుబాటులోకి తీసుకొచ్చిన గొప్ప వ్యక్తిగా కొనియాడారు. ప్రముఖ ఆడిటర్ తాళ్ళూరి శ్రీనివాసరాజు మాట్లాడుతూ చిరంజీవి రెడ్డి గోల్డెన్ జూబ్లి క్లబ్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరిగా ఉంటూ క్లబ్ అభివృద్ధి కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారని అభినందించారు.చిరంజీవి రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక, విద్య, వైద్య, క్రీడా రంగాలలో యువతీయువకులను అభివృద్ధి మార్గంలో నడిపించడంతో పాటు ఉత్తమ సమాజ ఆవిర్భావానికి దోహదపడినవారు అవుతామని మిత్రులందరి సహకారంతో అనేక కార్యక్రమాలను నిర్వహించడమే కాక రోటరి డిస్ట్రిక్ట్‌లో అనేక పదవులు సమర్థవంతంగా నిర్వహించి అందరు గవర్నర్‌ల మన్ననలు పొందడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని, ఇందుకు కారణభూతులైన జననీజనకులకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని అన్నారు. 50వ సారి స్వచ్ఛంద రక్తదానం చేయడం జరిగిందని, తనతో పాటు మరో 25 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపడం ద్వారా సమాజానికి ప్రాణదానం చేసారని అందరికీ ధన్యవాదాలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో లంక సాయిబాబు, నాగిరెడ్డి, చార్మినార్ వర్మ, మాచారెడ్డి, బదిరెడ్డి వెంకన్న, భూపేంద్ర, నేతి నాగేశ్వరరావు, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డా॥ కామరాజుతో పాటు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న విద్యార్థికి ఆపన్నహస్తం

- రూ.1.55లక్షల ఆర్థిక సాయం అందించిన ఉపాధ్యాయులు

గోపాలపురం, మేజర్ న్యూస్ : రెక్కాడితే గాని డొక్కాడని పేదకుంటుంబం.. ఆరుగాలం శ్రమిస్తేనేగాని ఐదేళ్లు నోట్లోకి వెళ్లని వైనం. అలాంటి కుటుంబానికి పెద్ద సమస్యే ఎదురయ్యింది. గోపాలపురం మండలం దొండపూడి మండల పరిషత్ ప్రాథమిక ప్రధాన పాఠశాలలో చదువుతున్న గున్నూరి అజిత్ అనే 4వ తరగతి విద్యార్థి ఊపిరితిత్తులు, లివర్ సమస్య వలన తీవ్ర అనారోగ్యంతో బాధపడుచున్నాడు.ఆ విద్యార్థి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉండుటవలన ఆక్సిజన్‌ను సిలిండర్ ద్వారా ప్రాణవాయువును అందించటానికి, మెరుగైన వైద్యం అందించడానికి నిధులు అవసరం అయ్యాయి. దీంతో స్పందించిన ఉపాధ్యాయులు, ఇతర దాతలు రూ.1,55,600 సేకరించారు. ఈ నగదును గోపాలపురం మండల విద్యాశాఖ అధికారి జి. శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు, ఎంపీటీసీ సభ్యులు మారాజు రాజేష్ చేతుల మీదగా అజిత్ కుటుంబానికి గురువారం అందజేసినారు. ఈ కార్యక్రమానికి వార్డు సభ్యులు, కాంప్లెక్స్ చైర్మన్ డి.సంపూర్ణ విజయ, జాగృతి స్వచ్ఛంధ సంస్థ డైరెక్టర్, ఆంగ్ల ఉపాధ్యాయులు మద్దాల నాగేశ్వరర

ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : గురువారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రత్యూష కుమారి ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. పర్యవేక్షణ గృహంలో ఉన్న బాలురతో మాట్లాడి వారి బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. మంచిగా చదువుకోవాలని అన్నారు. చెడు పనులు చేయకపోయినా అలాంటి పనులు చేసే వారితో ఉన్నవారికి కూడా పరిణామాలు వర్తిస్తాయని, కాబట్టి చెడు సహవాసాలకు దూరంగా ఉండాలని వివరించారు. ఉచితంగా న్యాయవాదిని పొందడం వారి హక్కు అని తెలిపారు. వసతి గృహములో ఎటువంటి సమస్యలున్నా. ఎటువంటి న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు.

1 కోటి 75 లక్షల వ్యయంతో రోడ్డుకి శంకుస్థాపన

చింతూరు, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం చింతూరు మండలం చిడిమూరు పంచాయతీ పాలగూడెం గ్రామంలో ఆర్ & బి రోడ్డు నుండి పాలగూడెం వరకు సుమారు 1కోటి 75 లక్షలు వ్యయంతో 3 కిలోమీటర్ల బిటి రోడ్డు పనులకు గురువారం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో చింతూరు మండల కన్వీనర్, ఎంపీపీ, జడ్పిటిసి, వైస్ ఎంపీపీలు, సర్పంచులు సొసైటీ ప్రెసిడెంట్, వివిధ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్, కోఆప్షన్ నెంబర్, వైస్ సర్పంచులు, వార్డ్ మెంబర్లు, సచివాలయం కన్వీనర్లు గృహసారథులు, ఎక్స్ సర్పంచ్లు, మాజీ ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామచంద్రపురం 'దేశం' అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

– డా॥ కాదా విజ్ఞప్తి

కాకినాడ,మేజర్న్యూస్ : రామచంద్రపురం నియోజకవర్గానికి తెలుగుదేశంపార్టీ తరపునపోటీచేసేందుకు అవకాశం కల్పించాల్సిందిగా సత్యాస్కాన్ అధినేత కాదా వెంకటరమణ విజ్ఞప్తి చేసారు. ఇటీవల తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసి తన అభ్యర్థిత్వాన్ని మరియు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ తాలూకు అనేక అంశాలతో కూడిన లేఖను అందజేసారు. సత్యస్కాన్ పేరుతో అత్యాధునిక పరికరాలను అంతర్జాతీయ ప్రమాణాలతో వ్యాధి నిర్ధారణ సేవలను సామాన్యులకు అందుబాటులో కాకినాడ, రాజమండ్రి, పిఠాపురం మరియు శ్రీకాకుళం ప్రాంతాలలో సేవలందిస్తున్నామన్నారు. సత్యస్కాన్ ద్వారా పేద గర్భిణీ స్త్రీలకు చేసిన ఉచిత స్కానింగ్ సేవలకు 2017లో రిపబ్లిక్ డే నాడు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అప్రిసియేషన్ అవార్డ్‌ను స్వీకరించడం జరిగిందన్నారు.

పామర్రు హైస్కూల్‌లో తల్లిదండ్రులు లేని మరియు కుటుంబ పెద్దలు లేని 70 మంది విద్యార్థులను విద్యాదత్తత క్రింద తీసుకుని వారికి అవసరమైన పుస్తకాలు, బ్యాగ్‌లు అందజేయడమే కాక కంప్యూటర్లు, వారి ఫీజులను కూడా చెల్లించి విద్యాభివృద్ధికి సేవలు అందిస్తున్నామన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణతోపాటు పామర్రు గ్రామ శెట్టిబలిజపేటలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 2 లక్షల రూపాయల వ్యయంతో భవనాలను ఆధునికీకరించడమే కాక కంప్యూటర్లను కూడా అందజేసామన్నారు.

చాకలిపేటలో ఉన్న కమ్యునిటీ హాల్ రక్షణ ప్రహారిగోడను రెండు లక్షల రూపాయలతో నిర్మించామన్నారు. రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ బోర్డ్ సభ్యునిగా ఉంటూ గత పది సంవత్సరాల నుండి అందిస్తున్న ఆర్థిక సహకారంతో టోర్నమెంట్లలో విజయం సాధించడమే కాక 72 మంది క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ ఉపాధి కల్పన జరగడం గొప్ప విషయంగా ప్రస్తావించారు. గుంటూరు కేంద్రంగా చేసుకుని పలువురికి విద్యకు అవసరమైన ఆర్థిక సహకారం అందించడమే కాక వారి అభివృద్ధికి ఎంతో సహకారం అందిస్తున్నామని గుర్తు చేసారు. శెట్టిబలిజ, శ్రీశైలం మరియు యాత కులస్థులకు నిర్మించిన నాలెడ్జ్ హబ్ హాస్టల్‌కు ఆరు లక్షల రూపాయలు విరాళం అందించడంతో పాటు వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని వివరించారు. గత 14 సంవత్సరాలుగా కాకినాడ నగరంలో 1,200 మొక్కలు నాటించడమే కాక వాటికి అవసరమైన ట్రీగార్డ్‌లను కూడా ఉచితంగా అందించామని పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో పేదప్రజలకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్న భావనతో 600 కొబ్బరి మొక్కలు పంపిణీ చేయడమే కాక వాటి పరిరక్షణకు ప్రత్యేక సహకారం అందించామన్నారు.

కాకినాడ, రామచంద్రపురం మరియు రాజమండ్రి ఆర్టీసి డిపోలలో స్కూలు విద్యార్థులకు ఉచిత ప్రయాణ పాసుల నిమిత్తం ఏటా లక్షా యాభై వేల రూపాయలు అందిస్తున్నామని, సంఘమిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ, పడాల చారిటబుల్ ట్రస్ట్, క్రియ, మలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్, రోటరి గోల్డెన్ జూబిలి క్లబ్, గాంధీభవన్, ప్రజా విద్యాలయం, పరివర్తన వంటి స్వచ్ఛంద సేవా సంస్థలకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా సేవలు అందిస్తూ సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్నామని డా॥ వెంకటరమణ వివరించారు. ప్రజలకు మరిన్ని సేవలను అందించడానికి తెలుగుదేశం పార్టీ ద్వారా ప్రత్యక్ష రాజకీయాలలోకి రావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేయడమే కాక రామచంద్రపురం నియోజకవర్గ ప్రాంతంలోని ప్రజలతో సత్సంబంధాలు ఎన్నో సంవత్సరాలుగా కొనసాగిస్తున్నామని, తాను తప్పక విజయం సాధిస్తానన్న ధీమాను వ్యక్తం చేసారు.

ఏ.ఎస్.డి.ఎస్ సంస్థ సహకారం మాటల్లో చెప్పలేం...

– ప్రకృతి వ్యవసాయ రైతు మడకం దూలయ్య..

వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ : ఏ.ఎస్.డి.ఎస్ సంస్థ సహకారం మాటల్లో చెప్పలేం,అద్భుతమైన సహకారం, సూచనలు,ప్రకృతి సిద్ధంగా! పంటలు పండించే పద్ధతులు,విధివిధానాలు వివరించే తీరు ఎన్నటికీ మారువలేంమని,మడకం దూలయ్య,అభిప్రాయం వ్యక్తం చేశారు.గురువారం ప్రెస్ నోట్ విడుదల చేశారు.ఈ ఆయన మాట్లాడుతూ ఏ.ఎస్.డి.ఎస్.సంస్థ ఆధ్వర్యంలో, ఏ.పి.సి.ఎన్.ఎఫ్, ద్వారా ప్రకృతివ్యవసాయ, సాగు పద్ధతులు,మోడల్ మేకర్,బి.మారయ్య, సలహాలు సూచనలతో నాకు ఉన్న 80 సెంట్ల భూమిలో ఆకుకూరలు సాగు అద్భుతమైన రీతిలో దిగుబడులు వస్తున్నాయని ఆయన వివరించారు.ప్రకృతి సిద్ధంగా ఆకు కూరలకు మంచి ఆదరణ లభిస్తుందని,ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.తోటకూర,గోంగూర, పాలకూర,చుక్కకూర, మెంతు కూర,కొత్తిమీర, తదితర ఆకు కూరలు బాగా పండుతున్నారని ఆయన అన్నారు.కూరకాయలు మొక్కలు మంచి వెపుగా పెడుతూ అద్భుత ఫలితాలు వస్తున్నాయని ఆయన తెలిపారు. వంగ, బెండ, బీర,సొరకాయ,కాకర,బీన్స్, గోరుచిక్కుడు, ముల్లంగి లతో పాటు, పుచ్చకాయ, మొక్కజొన్న,సజ్జలు,పూర్తి ప్రకృతి వ్యవసాయం(జీవామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, కాశాయాలు,) తయారు చేసి చీడ,పీడ నివారణకు ఉపయోగిస్తున్నామని ఆయన వివరించారు. ఈ కూరకాయలు,ఆకు కూరలు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని ఆయన వివరంగా చెప్పారు.మండలప్రజలు,వీటిని ఆహారంగాతీసుకోవడంద్వారా, ఆరోగ్యానికి ప్రకృతి వ్యవసాయంలో పండే పంటలుఅద్భుతమైన ఫలితాలు ఇస్తాయని ఆయన తెలిపారు.

ఏజెన్సీలో నిర్వాసితుల ఓట్లు బదిలీ అక్రమమే

– బాధ్యులపై చర్యలు చేపట్టాలని సిపిఎం డిమాండ్

రంపచోడవరం మేజర్ న్యూస్ : పోలవరం నిర్వాసితుల ఓట్ల బదిలీ అక్రమమని, దేవీపట్నం మండలం ఓటర్ల లిస్టులో అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం చేయాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కమిటీ నాయకులు గురువారం డిమాండ్ చేశారు. ఓటర్ల కు సమాచారం లేకుండానే దేవీపట్నం మండల నిర్వాసితుల ఓట్లను జగ్గంపేట నియోజకవర్గం పరిధిలోకి మార్చివేయడం అక్రమమని సిపిఎం రంపచోడవరం జిల్లా కమిటీ పేర్కొంది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లోతా రాంబాబు, మట్ల వాణీశ్రీ మాట్లాడుతూ దేవీపట్నం, తొయ్యేరు గ్రామాలకు సంబంధించి పునరావాసం, పరిహారం పూర్తి కాకుండానే వారి ఓట్లు రంపచోడవరం నియోజకవర్గం పరిధి నుండి జగ్గంపేట నియోజకవర్గానికి ఎలా మార్పు చేస్తారని ప్రశ్నించారు. పైగా ఓటర్లకు కనీస సమాచారం కూడా లేకుండా 2,600 మందిని నియోజకవర్గం మార్చడం అధికార వైసీపీ అక్రమాలకు ఇదో ప్రత్యక్ష నిదర్శనమన్నారు. బాధితులకు పునరావాసం, ప్యాకేజీ ఇవ్వడంలో శ్రద్ధ లేదని, వైసీపీ నాయకులకు ఓట్ల అక్రమాలపై శ్రద్ధ ఉందని సిపిఎం నాయకులు ఎద్దేవా చేశారు. ఇలాంటి అక్రమాలు ఇంకా ఎన్ని ఉన్నాయో జిల్లా అధికారులు నిగ్గుతేల్చాలని సిపిఎం డిమాండ్ చేసింది. దేవీపట్నం మండల ఓటర్ల లిస్ట్ పై తక్షణమే జిల్లా కలెక్టర్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ విషయంపై తాము రాష్ట్ర ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేస్తామని సిపిఎం జిల్లా కమిటీ పేర్కొంది. ఓటర్ల జాబితా అక్రమాలకు బాధ్యులైనవారిపై చర్యలు చేపట్టాలని, అక్రమాలకు పాల్పడిన వైసీపీ నేతలపై క్రిమినల్ కేసులు పెట్టాలని సిపిఎం డిమాండ్ చేసింది.

వరుపులకు ప్రజాభిమానం మెండు

– మీ వెంటే మేమున్నాం

– ఎంపీ సినీల్, ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అభ్యర్థులకు ఘన స్వాగతం

రౌతులపూడి,మేజర్ న్యూస్ : రౌతులపూడి స్థానిక మార్కెట్ సెంటర్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూల మాలు వేసి సత్కరించారు అనంతరం మీ వెంటే మేము న్నామంటూ రౌతులపూడి మండలం ప్రజలు వైయస్సార్ పార్టీ అభ్యర్థులు కాకినాడ ఎంపీ సునీల్, ప్రత్తిపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుకు ప్రజల స్వచ్ఛందంగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు.గురువారం మండల కేంద్రమైన రౌతులపూడిలో నిర్వహించిన గడపగడపకు వైఎస్ఆర్ ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు భారీ స్థాయిలో పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు మహిళలకు వివరించారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల గత పాలించిన ప్రజాప్రతినిధులు వల్ల లోపాలు ఉంటే సరిచేసి చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.గతంలో నిర్వహించిన గడపగడపకు ప్రభుత్వ కార్యక్రమాలు వచ్చామా వెళ్ళామంటూ ఉండేవని ప్రజలు ఆరోపించారు.వరుపుల హాయంలో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మహిళలు బ్రహ్మరథం పడుతున్నారు.గత ప్రజాప్రతినిధి నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం వాళ్ల కావలసిన వారికే పరిమితం అయ్యేది అని ఆరోపించారు.

ఎవరు అపోహలుకు పోవద్దని నేనున్నానంటూ ప్రజలకు వివరించారు.వచ్చే ఎన్నికల్లో వైయస్సార్ జగన్ మోహన్ రెడ్డిని మరల సీఎం చేసే బాధ్యత మనందరిపై ఉందని ప్రజలకు వివరించారు.ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిపిస్తే మీ సమస్యలు తీరుస్తానని హామీ ఇచ్చారు.మీ సమస్యలు తీరాలంటే ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని ప్రజలను కోరారు. మహిళలు హారతులు పట్టి ఆయనను దీవించారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గొల్లు దివాణం,వాసిరెడ్డి జమీలు, భాస్కర్ బాబు, కేదార్శెట్టి నాగేశ్వరరావు, మాజీ ఎంపిటిసి కామిరెడ్డి నాగేశ్వరావు,రియాల చిట్టిబాబు,సర్నం శీను,రఘు, కొండబాబు ఏసుబాబు వైయస్సార్ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు భారీ స్థాయిలో పాల్గొన్నారు.

జీవితం పట్ల అవగాహన లోపంతోనే నేరాలు

– రాజమండ్రి కేంద్ర కారాగార సామాజిక పరివర్తనా కార్యక్రమంలో వక్తలు సూచన

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : జీవితం పట్ల అవగాహన లోపంతోనే నేరతో పౌరులు జైళ్ల పాలవుతున్నారని ప్రముఖ సామాజిక విశ్లేషకులు మలసాని శ్రీనివాస్ అన్నారు. రాజమండ్రి కేంద్ర కారాగారంలో సూపరింటెండెంట్, ఎస్. రాహుల్ నేతృత్వంలో గురువారం వివిధ నేరాల్లో శిక్షా ఖైదీలకు సామాజిక పరివర్తన కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. జైలు డిప్యూటీ సూపరింటిండెంట్ ఎం రాజ్ కుమార్ అధ్యక్షతన మలసాని ఖైదీలకు మానసిక శిక్షణా కార్యక్రమాన్ని ఇచ్చారు. ఆదిలో జైలు అంటే కఠినమైన శిక్షలకు కేంద్రాలుగా ఉండేవని, మానవ విలువలు పెరిగిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా జైళ్లు పరివర్తనా కేంద్రాలుగా మారాయి అన్నారు. ప్రపంచవ్యాప్తంగా వెలువడిన ఎన్నో అద్భుత గ్రంథాలు చాలామంది జైల్లో ఉండి రాసినవే అని ఆయన అన్నారు. ఖైదీలు జైల్లో చదువుకుంటూ, గ్రంథాలయాలను వినియోగించుకుంటూ, జైల్లో ఇచ్చే పలు రకాల శిక్షణలను సద్వినియోగం చేసుకుంటూ విడుదల అయిన తర్వాత మంచి పౌరులుగా, సమాజ మార్గదర్శకులుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు పలువురు మానసిక ఖైదీలకు వ్యక్తిగత కౌన్సిలింగ్ ఇచ్చారు. జైలు డిప్యూటీ సూపరింటిండెంట్ ఎం రాజ్ కుమార్ మాట్లాడుతూ జైలులో ఖైదీల కోసం నిర్వహిస్తున్న పలు రకాల శిక్షణలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన పలువురు ఖైదీలు విడుదలైన తర్వాత తాము వ్యసనాల నుంచి దూరంగా ఉంటామని, ఎట్టి పరిస్థితుల్లోనూ నేరాలకు పాల్పడమని, అందరితోనూ ఆత్మీయంగా మెలుగుతామని, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరిస్తామని అయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పలువురు ఖైదీలు మాట్లాడుతూ వారం వారం నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమం తమకు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జైలు వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్ శ్రీనివాసరావు, జైలు ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు స్ఫూర్తి దాయకం

– జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

– 'ప్రాణమిత్ర'లకు సర్టిఫికెట్లు ప్రధానం – పాల్గొన్న కమిషనర్, రెడ్‌క్రాస్ ఛైర్మన్

కాకినాడ, మేజర్ న్యూస్ : ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే సత్సంకల్పంతో రెడ్‌క్రాస్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య పేర్కొన్నారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో గురువారం ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు సంభవించే సమయాలలో తీసుకోవలసిన రక్షణ చర్యలపై సుమారు 850 మంది సచివాలయ ఉద్యోగులకు ' రెడ్‌క్రాస్ ప్రాణమిత్ర వలంటీర్స్' పేరుతో శిక్షణ ఇచ్చారు. ఓఎన్‌జీసీ సహకారంతో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ మూడు రోజులపాటు ఈ ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. కాకినాడసిటీ ,రూరల్, తాళ్ళరేవు, తుని, ఉప్పాడ కొత్తపల్లి సహా వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులకు మూడు రోజులపాటు ఈ శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు జరిగిన సమయాల్లో ప్రాణ, ఆస్థినష్టం ఎలా నివారించాలి? ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే అంశంపై ఈ శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన ప్రాణమిత్ర వలంటీర్లకు గురువారం సర్టిపికెట్లు అందజేశారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలనే దృక్పదాన్ని ప్రతీ ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. జీవన గమనంలో 'సేవ' అన్నది ఒక అలవాటుగా మార్చుకోవాలని ఆయన సూచించారు. ప్రధానంగా రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ ఎన్నో ప్రజాప్రయోజన ప్రాజెక్టులను అమలు చేస్తోందని అభినందించారు. ప్రధానంగా ప్రాణమిత్ర వలంటీర్ల పేరిట ఇచ్చిన శిక్షణా కార్యక్రమం ఆపద సమయంలో ఎంతో మందికి అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇందుకు ఓఎన్‌జీసీ వంటి సంస్థలు అందిస్తున్న ప్రోత్సహం ప్రశంసనీయమన్నారు. రెడ్‌క్రాస్ వినతి మేరకు త్వరలోనే ఓ రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఓఎన్‌జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనుపమ్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలలో రెడ్‌క్రాస్ ఎంతో సేవా స్ఫూర్తితో పనిచేస్తోందని, ఆ సంస్థకు తమ వంతు తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ రక్తదాన శిబిరాలతోపాటు, వృద్ధాశ్రమాలు నిర్వహణ సహా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందుకు ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా గోల్డ్‌మెడల్ కూడా సాధించామన్నారు. అలాగే రెడ్‌క్రాస్ సేవల్లో ఏపీ జిల్లా లొ ప్రథమంగా నిలిచిందన్నారు.

70 పుష్‌కార్ట్స్ సమకూర్చిన ఓఎన్‌జీసీ.. కాకినాడ నగరపాలకసంస్థ ప్రజారోగ్య విభాగానికి రూ.10 లక్షలు వ్యయంతో 70 పుష్‌కార్ట్స్‌ను ఓఎన్‌జీసీ సంస్థ సమకూర్చింది. వీటిని జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య నగరపాలక సంస్థకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటరీ సూపర్‌వైజర్ జిలానీ, పలువురు శానిటరీ ఇన్స్‌పెక్టర్లు , ప్రాణమిత్ర వలంటీర్లు పాల్గొన్నారు.

సీటు దక్కకుంటే... సీను రిపీట్ అవుతుందా ...?

– 2014 ఎన్నికల్లో చంద్రబాబు మోసం చేశాడంటూ కన్నీరు పెట్టిన వర్మ

– కన్నీటి సెంటిమెంట్ కరిగి భారీ మెజార్టీ అందించిన పిఠాపురం ప్రజలు

– టిడిపి జనసేన పొత్తులో భాగంగా జనసేనకు దక్కనున్న పిఠాపురం సీటు

పిఠాపురం,మేజర్న్యూస్: రానున్న ఎన్నికల్లో సీటు దక్కకుంటే సీన్ రిపీట్ అవుతుందా...? అంటే అవును అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2014 ఎన్నికల్లో టిడిపి టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే వర్మ తీవ్రంగా ప్రయత్నించారు. టిడిపి అధినేత చంద్రబాబు పోతుల విశ్వానికి కేటాయించారు. సీటు దక్కకపోవడంతో ఆవేదన చెందిన ఎస్వీఎస్ఎన్ వర్మ తెలుగుదేశం పార్టీ కోసం ఎంతో కష్టపడ్డానని, తనకు సీటు కేటాయించకుండా అధినేత చంద్రబాబు తనను మోసం చేశారని కన్నీరు పెట్టుకున్నారు. పిఠాపురం నడి వీధుల్లో టిడిపి జెండాలు తగలబడ్డాయి. గ్రామ గ్రామాన వర్మ కన్నీరు కారుస్తున్న ఫ్లెక్సీలు ప్రత్యక్షమయ్యాయి. అధినేత తమ నాయకుడిని మోసం చేశాడంటూ ఆగ్రహించిన తమ్ముళ్లు పార్టీ జెండాలను చించి పడేశారు. కన్నీటి సెంటిమెంట్ తో స్వతంత్ర అభ్యర్థిగా 2014 ఎన్నికల్లో పోటీకి దిగిన వర్మ... అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధి కోసం అంటూ మళ్లీ అదే తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎన్నికల సమీపిస్తున్న వేళ మరలా అదే సీన్ రిపీట్ అయ్యే అవకాశాలు ఉన్నాయంటున్నారు విశ్లేషకులు. టిడిపి జనసేన పొత్తులో భాగంగా సామాజిక వర్గం అధికంగా ఉన్న పిఠాపురం సీటును జనసేనకు ఇచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఒకానొక దశలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వచ్చి ఇక్కడ పోటీలో ఉంటారంటూ జోరుగా ప్రకారం సాగుతుంది. ఈ నేపథ్యంలో తన సీటు దక్కకపోయినా సందర్భంగా స్వతంత్రంగా నైనా బరిలో నిలిచేందుకు మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెరవ వెనక యోహో రచిస్తున్నారన్న సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఒకవేళ అదే జరిగితే 2014 మాదిరిగానే మరలా త్రినేత్రం మోసం చేశాడంటూ ఫ్రీ ఇన్ రిపీట్ చేస్తారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. 2014 నాటి పరిస్థితులు వేరని, అప్పటి కన్నీటి సెంటిమెంటు కారణంగా పిఠాపురం నియోజవర్గ ప్రజలు అత్యధిక మెజార్టీ అందించారని, ఇప్పుడు మరలా అదే సేమ్ సీన్ రిపీట్ చేస్తే పిఠాపురం నియోజవర్గ ప్రజలు నమ్ముతారా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కాపు సామాజికవర్గంలో బలమైన నాయకుడిగా ఉన్న నేపథ్యంలో... ఆ సామాజిక వర్గం బలంగా ఉన్న పిఠాపురం నుండి పోటీలో నిలిస్తే... పవన్ ఓడించేందుకు మాజీ ఎమ్మెల్యే వరము సిద్ధపడుతున్నారన్నవార్తలు నేపథ్యంలో... కాపు సామాజిక వర్గం నుండి పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పట్టణ అభివృద్ధిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలి

– ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్

పెద్దాపురం,మేజర్ న్యూస్ : వేసవి కాలంలో పురపాలక సంఘంలో పుర ప్రజలకు మంచినీటి సమస్య లేకుండా చూడాలని, అలాగే పట్టణాభివృద్ధిపై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టాలని, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు ప్రకాష్, వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్‌లు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని పురప్రజలకు త్రాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. మున్సిపల్ కౌన్సిలర్ విజ్ఞపు రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో అర్బన్ హెల్త్ సెంటర్లు త్వరితగతిన ప్రారంభించి, పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, మెయిన్‌రోడ్‌లో షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరగా, కమీషనర్ కె.వి.పద్మావతి తెలుపుతూ దానికి సంబంధించి ప్రపొజల్స్ పంపించడం జరిగిందని, త్వరలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్మాణాలకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.. అలాగే మేజర్ డ్రైన్‌లో సిల్ట్‌ను కూడా తీయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. కౌన్సిలర్ తాటికొండ వెంకటలక్ష్మి పెదకాపు మాట్లాడుతూ తన వార్డులో డ్రైన్లు నిర్మించి, కల్వర్టులు నిర్మించలేదని, వాటిపై త్వరితగతిన పూర్తి స్థాయిలో నిర్మాణాలు చేపట్టాలని ఆమె కోరారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలో దోమల బెడద ఎక్కువగా ఉందని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే శతాబ్ది పార్కును అభివృద్ధి చేసి త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. పలువురు కౌన్సిలర్లు ఆయావార్డులలోని సమస్యలు లేవనెత్తారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు విడదాసరి రాజా, త్సలికి సత్యభాస్కరరావు, గోకేడ అప్పారావు, కట్టా రాజాబాబు, గోళ్ళ విజయలక్ష్మి, పప్పల దుర్గారావు, గడపా రామలక్ష్మి, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ డిఇ ఆదినారాయణ రావు, ఆర్వో చంద్రశేఖరం, ఏఇ కృష్ణ జీవప్రసాద్, మున్సిపల్ టిపిఓ ఫణికుమార్, ఎస్సై దావీదురాజు, మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, కౌన్సిల్ గుమస్తా (సి1) బత్తుల రవి, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు పటిష్టమైన బందోబస్తు

రామచంద్రపురం, మేజర్ న్యూస్ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు రామచంద్రపురం పట్టణంలో గల ఐదు పరీక్ష కేంద్రాలలో అనగా మోడరన్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, నారాయణ, వికాస్, వి.ఎస్.ఎం. కళాశాలల్లో ఈ నెల ఒకటో తేదీ నుంచి

సాయి రామకృష్ణ కుటుంబానికి పలువురి పరామర్శ

సామర్లకోట, మేజర్‌న్యూస్ : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ మాతృ మూర్తి ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని పలువురు సంతాపం తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. చీడిగ గ్రామం లో సాయి రామకృష్ణ మరియు వారీ సోదరులను పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేసిన వారిలో మాజీ ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ ఆదిత్య అధినేత డా.ఎన్.శేషారెడ్డి, సామర్లకోట మండలం టిడిపి అధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్,వైసీపీ నాయకులు తోటకూర వెంకటేశ్వర రావు,రమేష్,ఉపాధ్యాయ సంఘ జిల్లా నాయకులు కే కాశీ విశ్వనాథ్, మోర్త శ్రీనివాస్, నీలం అర్జున్ కుమార్,చవ్వకుల సత్య నారాయణ , మలకల రాము, ఆప్కాస్ట్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, పండిట్ అసోసియేషన్ వి. పల్లం రాజు తదితరులు పరామర్శించారు.

కట్నం వేదింపులపై కేసు నమోదు

ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ : అదనపు కట్నం వేధింపులపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.శ్రీనివాస్ తెలిపారు. ర్యాలీ గ్రామానికి చెందిన వీరమల్ల పద్మావతికి 2000 సంవత్సరంలో వీరమల్ల మహేష్ నారాయణతో వివాహం అయినది. వీరికి ఒక కొడుకు, కూతురు సంతానం కాగా ఈ మధ్యకాలంలో భర్త తాగుడుకి, చెడు వ్యసనాలకి బానిస అయ్యి భార్యను కొడుతూ అసభ్య పద జాలంతో దూషిస్తూ అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నాడు. భర్త వేదింపులపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపినారు.

కోరుకొండ నరసన్న కల్యాణోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు..

-భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు..
-ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి..
-పారిశుద్ధ్య నిర్వహణకు ఇతర ప్రాంతాల నుంచి సిబ్బంది..
-అత్యవసర చికిత్స కోసం అంబులెన్సులు అందుబాటులో ఉంచండి..
-ఆలయ సమీపంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయండి.
-బ్యారికేడ్లు,సిసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి పెట్టండి.
-సమీక్షా సమావేశంలో రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా,ఆర్డిఓ ఏ.చైత్ర వర్షిణి ...

కోరుకొండ, మేజర్‌న్యూస్ : చారిత్రక ప్రసిద్ధి చెందిన కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దివ్య కల్యాణోత్సవాలు (కోరుకొండ తీర్థం)కు హాజరయ్యే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆర్డీవో ఏ. చైత్ర వర్షిణిలు అధికారులకు సూచించారు. గురువారం కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణం నందు శ్రీ కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామివారికళ్యాణ ఎహోత్సవం నిర్వహణ, ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆర్డిఓ చైత్ర వర్షిణి తో కలిసి ఎమ్మెల్యే రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు జక్కంపూడి రాజా మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు హాజరయ్యే అవకాశము ఉన్నందున భక్తుల సంఖ్యను ముందుగానే అంచనా వేసి, ఎవరికీ ఇబ్బంది కలగని రీతిలో ఏర్పాట్లు ఉండాలన్నారు. మార్చి 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ ఉత్సవాలు జరగనున్నా యని తెలిపారు. ముఖ్యంగా భక్తులు భారీగా తరలివచ్చే అవకాశమున్నందున పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని,ఇతర పంచాయతీ లతో పాటు కార్పొరేషన్ నుంచి కూడా సిబ్బందిని ఇక్కడ నియమించాలని రాజా సూచించారు. ముఖ్యంగా కల్యాణోత్సవం, రథోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఎమ్మెల్యే రాజా కోరారు.అన్నవరం దత్తత ఆలయం అయినందున ఆ ఆలయ చైర్మన్, ధర్మకర్తల మండలి,అధికారుల సహకారం కూడా తీసుకోవాలని సూచించారు.

గతంలో రథోత్సవం సమయంలో జరిగిన సంఘటనలు దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని, ముహూర్తం సమయానికి రథోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించి చీకటి పడే లోపు లోనే ఆలయానికి చేరుకోనే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రథోత్సవంలో పాల్గొనడానికి భారీ భారీ స్థాయిలో భక్తులు రానున్న నేపథ్యంలో అత్యవసర వైద్య చికిత్స కోసం అంబులెన్స్ అందుబాటులో ఉంచడంతోపాటు మెడికల్ క్యాంపులు కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల సమయం దృష్ట్యా అధికారులు సమిష్టి కృషితో పనిచేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సంబంధిత అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఆర్డీవో చైత్ర వర్షిని మాట్లాడుతూ అన్ని శాఖల అధికారుల సమన్వయంతో లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.ఆలయ పరిసరాలలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు భక్తుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైనని ఆర్టీసీ బస్సులు నడపాలని, విద్యుత్ శాఖ కూడా నిరంతరం జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీవో చైత్ర వర్షిణి సూచించారు. ఈ సమావేశంలో సమావేశంలో అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్ర మోహన్, కోరుకొండ డీఎస్పీ శ్రీనివాస్,ఎంపీడీవో హేమ సుందర రావు,అన్నవరం దేవస్థానం సిబ్బంది, కోరుకొండ ఆలయ ఛైర్మన్ ఎస్పీ రంగరాజు బట్లర్,కోరుకొండ జడ్పీటీసీ సభ్యులు కర్రి నాగేశ్వర రావు,మండల వైసీపీ కన్వీనర్ అడపా కనకరాజు,నక్కా రాంబాబు, తాడి హరిచంద్ర ప్రసాద్ రెడ్డి, బొరుసు బద్రి,బొండాడ చందు వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

-శ్రీ కోరుకొండ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్స వం 2024 వివరాలు...కోరుకొండ కల్యాణోత్సవాల్లో భాగంగా మార్చి 19వ తేదీన శ్రీ స్వామి వారి కోనేరు వద్ద నుండి పుట్టమన్ను సేకరించడంతో అంకురార్పణ కార్యక్రమం నిర్వహిస్తారు.మార్చి 20వ తేదీన మధ్యాహ్నం 02.00 గంటలకు రథోత్సవం కార్యక్రమంతో పాటు రాత్రి 09:00 గంటలకు శ్రీవారి కళ్యాణోత్సవం జరుగుతుంది. మార్చి 21వ తేదీన నిత్యోపాసన, బలిహరణ నిర్వహిస్తారు.మార్చి 22వ తేదీన స్వామివారి ఆలయ ముఖ మండపంలో వేద పండితుల సమక్షంలో సదస్యం,సేవాకాలం హనుమంతు వాహనంపైగ్రామోత్సవం నిర్వహిస్తారు. మార్చి 23వ తేదీన గజ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం, రాత్రి 07:00 గంటలకు శ్రీరంగనాథ స్వామి వారి ఆలయంలో కల్యాణ మహోత్సవం జరుగుతుంది. మార్చి 24వ తేదీన స్వామిరికి చక్రతీర్థం మరియు ఊంజల్ సేవ నిర్వహిస్తారు. మార్చి 25వ తేదీన వివిధ రకాల పండ్లు,ప్రసాదాలతో స్వామివారికి విశేష సేవాకాలం, పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మార్చి 1న జగనన్న విద్యా దీవెన మొదటి విడత నేరుగా నగదు బదిలీ

-కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని 18 మండలాలు, 3 మునిసిపాలిటీ పరిధి లో 2023-24 ఏడాదికి సంబంధించి 31926 విద్యార్థులకి చెందిన 28730 తల్లుల ఖాతాలోకి రూ.24,09, 39,718/-లు జగనన్న విద్యా దీవెన మొదటి విడత నిధులను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా నేరుగా నగదు బదిలీ (డిబిటి) మార్చి ఒకటవ తేదీన జమ చెయ్యడం జరుగుతోందనీజిల్లాకలెక్టర్ డాకె. మాధవీ లత గురువారం ఒక ప్రకటనలో తెలియ చేశారు.జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి ఎమ్. సందీప్ మండలాలు వారీగా జగనన్న విద్యా దీవెన వివరాలూ తెలియ జేశారు.మండలము, విద్యార్థులు, తల్లులు, జమ చేస్తున్న మొత్తం... అనపర్తి .. 1073 విద్యార్థులు, 979 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.81,18,276..బిక్కవోలు 1218 విద్యార్థులు, 1100 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ. 90,53,577

చాగల్లు - 1186 విద్యార్థులు, 1081 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.92,18,012..దేవరపల్లి - 1356 విద్యార్థులు, 1228 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.1,00,90,726

గోకవరం 874 విద్యార్థులు, 798 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.56,84,116..గోపాలపురం 990 విద్యార్థులు, 878 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.72,89,511

కడియం - 1646 విద్యార్థులు, 1480 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.1,23,66,986..కోరుకొండ - 1177 విద్యార్థులు, 1074 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.80,62,073

కొవ్వూరు - 1225 విద్యార్థులు, 1088 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.94,30,593..కొవ్వూరు (అర్బన్) - 713 విద్యార్థులు, 636 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.52,84,667

నల్లజెర్ల - 1326 విద్యార్థులు, 1184 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.1,03,92,710.. నిడదవోలు - 1459. విద్యార్థులు, 1294 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.1,12,40,109.. నిడదవోలు (అర్బన్) - 768 విద్యార్థులు, 690 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.63,56,325..పెరవలి - 1330 విద్యార్థులు, 1184 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.1,00,05,386

రాజమండ్రి (అర్బన్) - 5777 విద్యార్థులు, 5212 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.4,48,23,763..రాజమహేంద్రవరం రూరల్ - 3444 విద్యార్థులు, 3091 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.2,54,87,929..రాజానగరం - 1751 విద్యార్థులు, 1582 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.1,25,38,331

రంగంపేట - 1056 విద్యార్థులు, 941 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.71,87,403..సీతానగరం - 1115 విద్యార్థులు, 1028 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.83,64,098

తాళ్లపూడి - 942 విద్యార్థులు, 835 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.7318190.. ఉండ్రాజవరం - 1500 విద్యార్థులు, 1347 తల్లులు, జమ చేస్తున్న మొత్తం రూ.1,26,26,937

శెట్టిబలిజల తరపున సంపూర్ణ మద్దతునిస్తాం

- శెట్టిబలిజ మహానాడు కన్వీనర్, ఎమ్మెల్సీ కుడుపూడి
- ఎమ్మెల్యే ద్వారంపూడితో భేటీ

కాకినాడ, మేజర్ న్యూస్ : రానున్న ఎన్నికల్లో కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి శెట్టిబలిజ సామాజికవర్గం నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ హామీ ఇచ్చారు. గురువారం ఆయన ఎమ్మెల్యే ద్వారంపూడిని ఆయన నివాసంలో కలుసుకున్నారు. శెట్టి బలిజ సామాజికవర్గం తరపు మద్దతు తెలియజేస్తూ ఎమ్మెల్యే ద్వారంపూడి లేఖ అందజేసారు. ఈ సందర్భంగా కుడుపూడి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి శెట్టిబలిజ సామాజికవర్గానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చి అగ్రస్థానంలో నిలిపారన్నారు. రెండు పార్లమెంట్, ఒక రాజ్యసభ, ఎమ్మెల్యే, మంత్రి పదవులు, ఎమ్మెల్సీ, కార్పోరేషన్ చైర్మన్ పదవులిచ్చి శెట్టిబలిజలకు ఉన్నత స్థానాన్ని కల్పించారన్నారు. గతంలో ఏ రాజకీయ పార్టీ ఆదరించనంతగా శెట్టిబలిజ సామాజికవర్గానికి సియం జగన్ పెద్దపీట వేసారన్నారు. పెద్దల సభకు సైతం సీనియర్ నేత పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను రాజ్యసభ సభ్యునిగా ఎంపిక చేసి తమ సామాజికవర్గంపై ఉన్న అభిమానాన్ని ముఖ్యమంత్రి చాటుకున్నారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కాకినాడ నగరంలో శెట్టిబలిజల కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం 630 చదరపు గజాల స్థలాన్ని కేటాయించారన్నారు. తమ సామాజిక వర్గానికి అన్ని విధాలా అండగా ఉంటున్న ఎమ్మెల్యే ద్వారంపూడికి శెట్టి బలిజ సంఘీయులంతా ఏకత్రాటిపై నిలిచి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. శెట్టి బలిజలను అన్ని విధాల ఆదరిస్తూ అభివృద్ధి, సంక్షేమంలో పెద్దపీట వేస్తున్న ద్వారంపూడి వంటి నేతలను గెలుపించుకోవడం ద్వారా మరింత ప్రగతి సాధించే అవకాశం ఉంటుందన్నారు.సిటీఎమ్మెల్యేద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రాజకీయంగా శెట్టిబలిజ సామాజికవర్గం ఆదినుంచి ఎంతో మద్దతుగా నిలుస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా తనకు మద్దతునివ్వాలని, వీరిఅభివృద్ధి,సంక్షేమం,సమస్యల పరిష్కారా నికి ఎల్లప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు శెట్టిబలిజ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్ల మీద సమీక్ష సమావేశం

-గోడ పత్రిక ఆవిష్కరణ

సామర్లకోట,మేజర్‌న్యూస్ : పంచారామ క్షేత్రమైన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వర ఆలయంలో జరిగే మహా శివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు ఐక్యంగా సహకరించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. స్థానిక భీమేశ్వర ఆలయంలో మహా శివరాత్రి ఉత్సావాల ఏర్పాట్లకు సంభందించి అధికారులతో సమావేశాన్ని ఆలయ అధికారి నీలకంఠం అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి కాకినాడ ఆర్థివో, ఇరిగేషన్, పోలీస్, రెవిన్యూ, పోలీస్ శాఖలకు చెందిన అధికారులు విధిగా హాజరు కావాల్సి ఉండగా ఇరిగేషన్, పోలీస్ శాఖలతో పాటు పలు శాఖల అధికారులు హాజరు కాలేదు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసి పాల్గొన్న ఎమ్మెల్యే రాజప్ప, రాష్ట్ర కార్మిక నాయకులు, సీనియర్ వైసీపీ నాయకులు దవులూరిసుబ్బారావు లు మాట్లాడుతూ మహా శివరాత్రి ఉత్సవాలకు సుదూర ప్రాంతాలనుంచి సైతం భక్తులు భారీగా తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. ఆలయ పుష్కరిణిలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించే పద్ధతి ఉన్నందున కోనేరులో పరిశుభ్రమైన గోదావరి జాలాలు నింపే భాద్యత, గోదావరి కావువాలోనూ భక్తులు స్నానాలు ఆచరించే అవకాశం ఉన్నందున కాలువలోనూ శుభ్రమైన జలాలు ఉండేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆలయం వద్ద, లోపల పారిశుధ్య సేవలకు మున్సిపల్ అధికారులు భాద్యత తీసుకుని పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించాలన్నారు. ఇంకా బందోబస్తు విషయంలో పోలీస్ శాఖ నుంచి అవసరమైన సిబ్బందిని కేటాయించి ట్రాఫిక్ కు ఇబ్బంది కలగకుండా, క్యూ లైన్ ల ద్వారా భక్తులు సక్రమైన పద్ధతిలో వెళ్లి దర్శనం చేసుకునే విధంగా అధికారులు చూడాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఏదైనా ఆరోగ్య పర ఇబ్బందులకు గురైతే వారికి సేవల నందించేందుకు వైద్య శిభిరాన్ని వైద్య అధికారులు ఏర్పాటు చెయ్యాలన్నారు. ఇంకా విద్యుత్ సరఫరా విషయంలో ట్రాన్స్ కో అధికారులు అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. స్నానఘట్టాల వద్ద గజ ఈతగాళ్ళను ఏర్పాటు చెయ్యాలాన్నారు. ఇంకా సమావేశంలో జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, కౌన్సిలర్ నేతల హరిబాబు, అగ్నిమాపక శాఖ అధికారి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ జె రామారావు, ఇంచార్జ్ తహసీల్దార్ ఆర్ శ్రీనివాసరావు, తదితరులు మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవాల గోడ పత్రికలను ఎమ్మెల్యే తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పరిధిలోని నాయకులు, మాజీ ధర్మకర్తలు, ఆలయ అర్చకులు, భక్త నాయకులు పాల్గొన్నారు.

స్థలాన్ని సర్వే చేసి మాకు అప్పగించండి

- స్థల యజమాని వేడుకోలు

కాకినాడ రూరల్, మేజర్‌న్యూస్ : కాకినాడ శివారు మహాలక్ష్మినగర్ ప్రాంతంలో ఉన్న ఆకుల గోపయ్య ఎడ్యుకేషన్ ట్రస్టుకు సంబంధించి ఉన్న ఎనిమిది ఎకరాల 85 సెంట్లు భూమిని సర్వే చేసి మాకు అందించాలని స్థల హక్కుదారుడు ఆకుల నరేష్ వేడుకొన్నారు. సుమారు 15 ఏళ్ల నుండి ఈ స్థలం కాకినాడకు చెందిన మాజీ ప్రజాప్రతినిధి, వారి బంధువులు వారిదే అంటూ ఇబ్బందులు పెడుతున్నారని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి ఫలితం లేదన్నారు. తక్షణమే మా ఈ స్థలాన్ని సర్వే చేసి అధికారులు అప్పగించాలని విలేకరుల ఎదుట వాపోయారు. గురువారం మహాలక్ష్మినగర్ ట్రస్ట్ ప్రాంగణం వద్ద సర్వే చేస్తామంటూ నగర, గ్రామీణ ప్రాంతాలకు చెందిన రెవెన్యూ అధికారులు వచ్చినా వారు సర్వే చేయకుండా ఎవరెవరితోనో ఫోన్లో మాట్లాడి మెల్లగా జారుకున్నారని నరేష్ చెప్పారు.తక్షణమే అధికారులు సర్వే చేసి స్థలాన్ని అప్పగించాలని నరేష్ కోరారు. మాకు చెందిన సర్వే స్థల నెంబర్లలో ఎటువంటి ఇబ్బందులు లేకపోయినా, అవతలి వ్యక్తులు కావాలని వివాదం సృష్టిస్తున్నట్లు నరేష్ చెప్పారు. స్థలము వద్ద ఎటువంటి వివాదం రాకుండా పోలీసు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

250 మందికి నేత్ర పరీక్షలు...

సామర్లకోట, మేజర్‌న్యూస్ : సామర్లకోట బ్రౌన్ పేటలోని ట్రూ గాస్పెల్ చర్చిలో గురువారం నిర్వహించిన ఉచిత నేత్ర శిభిరంలో 250 మందికి నేత్ర పరీక్షలు చేయగా 25 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. ట్రూ గాస్పెల్ చర్చి, ట్రూ గాస్పెల్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రెవ. డా. ఈలి సత్య సువార్త రాజు, షారోన్ సువార్త రాజుల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఉచిత నేత్ర శిభిరాన్ని నిర్వహించారు. ఈ శిభిరాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్ రిబ్బను కత్తిరించి ప్రారంభించారు. పిఠాపురం సిఎంసి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిభిరంలో నేత్ర వైద్యులు, సిబ్బంది పాల్గొని పరీక్షలు జరిపారు. 250 మందికి పరీక్షలు జరిపి వారిలో 25 మందిని ఆపరేషన్ లకు ఎంపిక చేశారు. వారికి పిఠాపురం సిఎంసి ఆసుపత్రిలో శాస్త్ర చికిత్సలు చేయనున్నట్టు శిభిర నిర్వాహకులు డా. సువార్తరాజు చెప్పారు. ఈ శిభిరంలో చర్చి నాయకులు, యువత పాల్గొని సేవలనందించారు.

కొత్త తహసీల్దార్ శ్రీనివాసు ప్రత్యేక పూజలు

సామర్లకోట,మేజర్‌న్యూస్ : సామర్లకోట తహసీల్దార్‌గా నూతనంగా భాద్యతలు చేపట్టిన శ్రీనివాస్ గురువారం పంచారామ క్షేత్రం అయిన సామర్లకోట భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. సామర్లకోట తహసీల్దార్ ఎస్ ఎల్ ఎన్ కుమారి ఎన్నికల బదిలీలో భాగంగా బదిలీ కాగా గత కొద్ది కాలంగా డిప్యూటీ తహసీల్దార్ ఆర్ శ్రీనివాసరావు ఇంచార్జి భాద్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే ఆయన కూడా కాకినాడ రూరల్ మండలానికి బదిలీ కాగా స్థానిక తహసీల్దార్ గా పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండల తహసీల్దార్ గా పని చేస్తున్న శ్రీనివాస్ ను నియమించగా ఆయన గురువారం విధుల్లో చేరారు.

అనంతరం ఆయన భీమేశ్వరాలయంలో స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. తదుపరి జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల, పెద్దాపురం ఆర్డివో సీతా రామారావు లను మర్యాద పూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఇంచార్జి శ్రీనివాసరావు, విఆర్‌వోఎస్ మురళి తదితరులు పాల్గొన్నారు.